



Truth of News

# సూర్య వాస్తవం

PRGI Reg No: APTEL/26/A4782

http://www.suryavastavam.in

చీఫ్ ఎడిటర్ : మొఘల్ ఇర్షాద్ బేగ్

IRS PUBLICATIONS
irspublications12@gmail.com

అన్నమయ్య జిల్లా | సంపుటి: 01 | సంచిక : 354 | మంగళవారం 14 జూలై 2026 | పేజీలు : 8 | వెల రూ.6.50

Circulated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi

### బద్రీనాథ్ విరాళాల చోరీ కేసులో

## ప్రధాన నిందితుడు అరెస్ట్

- అదుపులోకి తీసుకున్న పాలీసులు
- కోర్టులో హాజరు



బద్రీనాథ్ - సూర్యవాస్తవం

అయోధ్యలోని రామమందిరం లో విరాళాల తస్కరణ కేసు తర్వాత ఆలయాల్లో చోరీ కేసులు బయటకు వస్తున్నాయి. తాజాగా ఉత్తరాఖండ్‌లోని ప్రముఖ పుణ్య క్షేత్రం బద్రీనాథ్ ఆలయంలో విరాళాల చోరీ కేసు తెరపైకి వచ్చింది. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఆరోపణలు ఎదుర్కొంటున్న, సస్పెండ్ అయిన బద్రీనాథ్-కేదార్‌నాథ్ ఆలయ కమిటీ (బీకేటీసీ) ఉద్యోగి ప్రమోద్ నౌటియాల్‌ను ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) అరెస్టు చేసింది. ఆయనను సోమవారమే కోర్టులో హాజరు పరచనున్నట్టు పోలీసులు తెలిపారు.నిందితుడి కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసిన పోలీసులు, అతడు డెహ్రాడూన్‌లో ఉన్నట్లు గుర్తిం చారు. అక్కడికి చేరుకున్న సిట్ అధికారులు గంటపాటు విచారించారు. అనంతరం ఆదివారం రాత్రి 9.45 గంటల నుంచి 10.15 గంటల మధ్య అతడిని అదుపులోకి తీసుకున్నారు. గోపేశ్వర్ కోర్టులో హాజరుపర్చనున్నట్టు ఉత్తరాఖండ్ పోలీసులు

- మిగతా 2లో..

### రామాలయం విరాళాల చోరీపై

## నివేదిక సమర్పించండి

- సిట్‌కు సుప్రీంకోర్టు ఆదేశం
- రామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్‌కు నోటీసులు జారీ
- సిట్ దర్యాప్తు పురోగతి నివేదికను సీల్డ్ కవర్‌లో సమర్పిస్తాం : సొలిసిటర్ జనరల్



న్యూఢిల్లీ - సూర్యవాస్తవం

అయోధ్య రామాలయం విరాళాల చోరీపై దర్యాప్తు పురోగతి నివేదికను సమర్పించాలని సిట్‌ను సుప్రీంకోర్టు ఆదేశించింది. విరాళాల చోరీ వ్యవహారంపై తగిన వివరణ ఇవ్వాలని రామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్‌కు, ఇంకా కేంద్రానికి కూడా నోటీసులు జారీ చేసింది. రామాలయం లో భక్తులు సమర్పించిన కానుకల చోరీ వ్యవహారంపై సీబీఐ విచారణ కోరుతూ దాఖలైన పిటిషన్లపై సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీ, జస్టిస్ వి.మోహనతో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. రామాలయ వ్యవహారాలను పర్యవేక్షించే రామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ ఆర్థిక లావాదేవీలపై ఆడిట్ నిర్వహించాలని ఓ పిటిషన్‌లో పేర్కొన్నారు. ఆలయ ట్రస్ట్ వ్యవహారాలు, పరిపాలనకు సంబంధించిన ఆర్థిక అవకతవకలు,



## యువతకు భారీ కానుక

- 10,000 భారత్ జోడో యూత్ అసోసియేషన్ల ఏర్పాటుకు ప్రభుత్వఆదేశం
- ఒక్కో అసోసియేషన్‌కు రూ.10 లక్షలు
- యువతలో నాయకత్వ లక్షణాలను పెంపొందించే లక్ష్యంతో, రాష్ట్రంలోని ప్రతి గ్రామ పంచాయతీలో 6,000 సంఘాలను, పట్టణ వార్డులలో 4,000 సంఘాలను ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది.

బెంగళూరు- సూర్యవాస్తవం

రాష్ట్ర 18వ ముఖ్యమంత్రిగా డీకే శివకుమార్ ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం జరిగిన తొలి మంత్రివర్గ సమావేశంలో ప్రకటించిన విధంగా, రాష్ట్రంలో 10,000 'భారత్ జోడో యువ సంఘాల' ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం సోమవారం అధికారిక ఉత్తర్వు జారీ చేసింది. యువతలో నాయకత్వ లక్షణాలను పెంపొందించే లక్ష్యంతో, రాష్ట్రంలోని ప్రతి గ్రామ పంచాయతీలో 6,000 సంఘాలను, ప్రతి పట్టణ వార్డులో 4,000 సంఘాలను ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. అంతేకాకుండా, ప్రతి సంఘానికి ఏటా రూ. 1,000 కోట్ల గ్రాంటును, అంటే ఒక్కొక్క సంఘానికి రూ. 10 లక్షల చొప్పున అందిస్తామని

2లో

సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి

# గోదావరి డెల్టాకు శాశ్వత భద్రత

- 2 ఏళ్లల్లో ఇరిగేషన్ రంగానికి రూ.24 వేలకోట్లు ఖర్చు
- ప్రకటించిన క్యాలెండర్ కు అనుగుణంగా ఇరిగేషన్ ప్రాజెక్టులు
- డబ్బులిచ్చి మరీ గొడ్డలి పార్టీ అరాచకాలు సృష్టిస్తోంది
- పవన్‌ను అవమానిస్తున్నారు... వాళ్ల కుటుంబ సభ్యులను కించపరుస్తున్నారు
- పిచ్చుకలంకలో రైతుల సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు
- ధవళేశ్వరం బ్యారేజీకి రూ.153 కోట్లతో 117 కొత్త గేట్ల వఏర్పాటు పనులు ప్రారంభించిన ముఖ్యమంత్రి



కొత్తపేట - సూర్యవాస్తవం :

గోదావరి డెల్టాకు శాశ్వత రక్షణ కల్పించే చర్యలను కూటమి ప్రభుత్వం చేపట్టిందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెల్లడించారు. దీంట్లో భాగంగానే సర్ అర్థర్ కాటన్ బ్యారేజ్ కు కొత్త గేట్లను అమరుస్తున్నట్టు చెప్పారు. ధవళేశ్వరం బ్యారేజీకి రూ. 152.95 కోట్ల వ్యయంతో 117 కొత్త గేట్లను అమర్చే పనులను సీఎం చంద్రబాబు ప్రారంభించారు. ఈ మేరకు ధవళేశ్వరం బ్యారేజ్ వద్ద శిలాఫలాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ధవళేశ్వరం బ్యారేజీ వద్ద నీటి ప్రవాహాన్ని పరిశీలించిన ముఖ్యమంత్రి ఇరిగేషన్ అధికారులతో మాట్లాడారు. వచ్చే ఏడాది జూన్ నెలకు కొత్తగేట్ల బిగింపు ప్రక్రియను పూర్తి చేయాలని సీఎం ఆదేశించారు. గోదావరి పుష్కరాలకు గేట్లను అమర్చే పనులను పూర్తి చేస్తామని అధికారులు తెలిపారు. ధవళేశ్వరం బ్యారేజీ నుంచి ప్రస్తుతం సముద్రంలోకి ఎంత నీరు వెళ్తోందని సీఎం చంద్రబాబు ఆరా తీశారు. ప్రస్తుతం 27 వేల క్యూసెక్కుల నీరు సముద్రంలోకి వెళ్తోందని అధికారులు వివరించారు. అలాగే కాల్వలకు ఎన్ని క్యూసెక్కులు విడుదల చేశారని ముఖ్యమంత్రి అడిగారు. 14,700 క్యూసెక్కుల నీరు కాల్వలకు వదిలామని అధికారులు చెప్పారు. కాల్వ చివరి భూములకూ నీరు అందేలా నిరంతరం పర్యవేక్షిస్తూ ఉండాలని సీఎం ఆదేశించారు. ఈ విషయంలో ప్రజా ప్రతినిధులు,

- మిగతా 2లో..



### లోపాలు సరిదిద్దాకే

## ముందుకెళ్తాం

- బనకచర్లను అడ్డుకోవాలన్న పిటిషన్ పై సుప్రీం స్పష్టత
- ఏపీకి ఇంజక్షన్ నోటీసులు ఇవ్వాలన్న అభ్యర్థనకు నో

న్యూఢిల్లీ- సూర్యవాస్తవం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నిర్మిస్తోన్న పోలవరం --బనకచర్ల(నల్లమల్లసాగర్) ప్రాజెక్ట్‌ను అడ్డుకోవాలని దాఖలు చేసిన పిటిషన్‌లో అన్ని లోపాలు సరిదిద్దాకే ముందుకెళ్తామని సర్వోన్నత న్యాయస్థానం తెలంగాణ ప్రభుత్వానికి స్పష్టం చేసింది. ఈ విషయంలో గతంలో కోర్టు పేర్కొన్న అవసరమైన అన్ని షరతులు పూర్తి చేయాలని సూచించింది. బనకచర్ల ప్రాజెక్ట్ పై ఏపీ ప్రభుత్వాన్ని నిలుపుదల చేసేలా ఇంజెక్షన్ ఆదేశాలు ఇవ్వాలని ఈ ఏడాది మార్చిలో

- మిగతా 2లో..



## కేంద్ర విద్యాశాఖ మంత్రి తప్పుకోవాలి

- విద్యార్థుల ఆత్మహత్యలకు బాధ్యత వహించాలి
- సీజేపీ ఆందోళన, సోనమ్ వాంగ్‌చుక్ దీక్షకు
- సీపీఐ(ఎం) నేతల సంఘీభావం
- 20న నిర్వహించే 'చలో పార్లమెంట్' విజయవంతం చేయాలి

న్యూఢిల్లీ - సూర్యవాస్తవం

విద్యార్థుల ఆత్మహత్యలకు బాధ్యత వహించి కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తప్పుకోవాలని సీపీఐ(ఎం) నేతలు డిమాండ్ చేశారు. దేశంలో వరుసగా జరుగుతున్న పరీక్షల పేపర్ లీకేజీలు, విద్యా వ్యవస్థలో పెరుగుతున్న అవినీతి, కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలకు నిరసనగా కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ఆందోళన, పర్యావరణ కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ చేపట్టిన నిరవధిక నిరాహార దీక్షా శిబిరాన్ని

- మిగతా 2లో..

# రాష్ట్ర ప్రయోజనాలే ముఖ్యం

- పార్టీలకు అతీతంగా పార్లమెంటులో తెలంగాణ వాణి వినిపించండి అవసరమైన సమాచారం ఇస్తాం : ఎంపీల సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి
- హాజరైన బీజేపీ ఎంపీలు ఈటల, కొండా కాళేశ్వరం, పాలమూరు-రంగారెడ్డిపై నిపుణుల కమిటీ వేయాలని విజ్ఞప్తి
- సానుకూలంగా స్పందించిన సీఎం ప్రాజెక్టులు, రవాణా అనుమతులు సాధించాలని దిశానిర్దేశం
- ప్రధాని, కేంద్ర మంత్రులను కలిసి విజ్ఞప్తులు చేయండి
- అందర్నీ సమన్వయం చేసుకోవడం కోసం తెలంగాణ భవన్‌లో ఐఏఎస్ అధికారి నియామకం



హైదరాబాద్ - సూర్యవాస్తవం

తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలే లక్ష్యంగా పార్లమెంటులో గళాన్ని వినిపించాలని సీఎం ఏ రేవంత్‌రెడ్డి అన్నారు. దానికోసం రాజకీయాలకు అతీతంగా పనిచేసేందుకు సిద్ధంగా ఉండాలని చెప్పారు. పార్లమెంట్ సమావేశాల నేపథ్యంలో సోమవారంనాడాయన హైదరాబాద్ ప్రజాభవన్‌లో ఎంపీలతో భేటీ అయ్యారు. దీనికి కాంగ్రెస్ ఎంపీలతోపాటు బీజేపీ ఎంపీలు ఈటల రాజేందర్, కొండా విశ్వేశ్వరరెడ్డి కూడా హాజరయ్యారు. అధికారపార్టీ నిర్వహించే ఎంపీల సమావేశంలో ప్రతిపక్ష? ఎంపీలు కూడా పాల్గొనడం ఇదే తొలిసారి. ఈ సందర్భంగా పార్లమెంటులో రాష్ట్ర ప్రయోజనాల కోసం అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించారు. కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉన్న రాష్ట్ర అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఏర్పాటు చేశారు. పార్టీలకు అతీతంగా ప్రభుత్వం వద్ద ఉన్న సమాచారాన్ని ఎంపీలందరికీ అందచేస్తామని సీఎం చెప్పారు. నీటి పారుదల ప్రాజెక్టులు, మౌలిక వసతుల అభివృద్ధికి సంబంధించి కేంద్రం నుంచి అవసరమైన అనుమతుల సాధనపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. హైదరాబాద్‌లో

- మిగతా 2లో..

## రామాలయం విరాళాల చోరీపై
# నివేదిక సమర్పించండి

(మొదటి పేజీ తరువాయి)

ఇతర చట్టవిరుద్ధ కార్యకలాపాలపై సీబీఐ నేతృత్వంలో దర్యాప్తు చేయాలని కోరారు. కోట్లాది మంది భక్తులు, దాతల విశ్వాసాన్ని నిలబెట్టడానికి అవసరమైన నియంత్రణ, పర్యవేక్షణ, ఆడిట్ యంత్రాంగాలను ఏర్పాటు చేసే విధంగా కేంద్రం, యూపీ ప్రభుత్వం, ట్రస్ట్‌కు ఆదేశాలు ఇవ్వాలని పిటిషన్‌లో వివరించారు. ఎఫ్ఐఆర్ లేదా సాధారణ క్రిమినల్ కేసు కూడా నమోదు చేయకుండానే సిట్ ఈ వ్యవహారంపై విచారణ ప్రారంభించిందని పిటిషనర్లు ఆక్షేపించారు. ట్రస్ట్‌కు సంబంధించి నిధుల దుర్వినియోగం, ఇతర అవకతవకలకు సంబంధించిన నివేదికలు చివరికి నిజమని తేలినా, తేలకపోయినా, అవన్నీ అయోధ్య పూర్వ వైభవాన్ని పునరుద్ధరణకు పోరాడిన తరాల్లో తీవ్ర ఆందోళనను కలిగించాయన్నారు. ఇందులో ఉన్న అంశాలు కేవలం 'కాగ్నిజబుల్' (పోలీసులు స్వయంగా కేసు నమోదు చేసే) నేరాలకు సంబంధించినవి మాత్రమే కాదని, అసంఖ్యాక భక్తులు, ప్రజల విశ్వాసం, మనోభావాలు, నమ్మకాలపై కూడా ప్రత్యక్ష ప్రభావం చూపుతాయని తెలిపారు.

**ట్రస్ట్ విరాళాలు, కానుకల పూర్తి వివరాలు ఇవ్వాలని పిటిషన్**

రామ్ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ ఏర్పడిన నాటి నుంచి స్వీకరించిన అన్ని విరాళాలు, కానుకల పూర్తి వివరాలను అందించేలా సుప్రీం కోర్టు ఆదేశించాలని పిటిషన్‌లో కోరారు. ఈ వివరాల్లో నగదు విరాళాలు, బ్యాంకు బదిలీలు, డిజిటల్ చెల్లింపులు, విదేశీ విరాళాలు, వస్తు రూపంలో విరాళాలు, బంగారం, వెండి, ఇతర విలువైన వస్తువులతో పాటు, వాటి అకౌంటింగ్, సంరక్షణ, వినియోగానికి సంబంధించిన వివరాలు కూడా చేర్చాలని తెలిపారు.

**సీల్డ్ కవర్‌లో సమర్పిస్తామన్న సొలిసిటర్ జనరల్**

ఈ సందర్భంగా కేసు విచారణలో భాగంగా ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపించారు. దర్యాప్తునకు సంబంధించిన స్టేటస్ రిపోర్ట్‌ను సీల్డ్ కవర్‌లో సమర్పిస్తామని కోర్టుకు వివరించారు. అయితే, ఆ నివేదిక ప్రతిని తమకు కూడా ఇవ్వాలని పిటిషనర్లు కోరగా, ఆ అభ్యర్థనకు వ్యతిరేకంగా మెహతా వాదించారు. దీనికి ధర్మాసనం స్పందిస్తూ, "మీకు చట్టం తెలుసు. ఎలాగైనా వారు ఆ రిపోర్ట్‌ను చూస్తారు" అని స్పష్టం చేసింది. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలకు జారీ చేసిన నోటీసులను మెహతా స్వీకరించారు. దీంతో ఈ కేసు తదుపరి విచారణను సుప్రీంకోర్టు ఈ నెల 20కు వాయిదా వేసింది.రామాలయంలో విరాళాల దుర్వినియోగం ఆరోపణల నేపథ్యంలో గత 13న ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వం సిట్‌ను ఏర్పాటు చేసింది. ఈ క్రమంలోనే దర్యాప్తు చేపట్టగా పలు కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. లెక్కింపు సమయంలో పర్యవేక్షణ లోపాలను సిట్ గుర్తించింది. అనంతరం పలు అరెస్టులు చోటుచేసుకోవడంతో రామ జన్మభూమి ట్రస్టు ప్రధాన కార్యదర్శి పదవికి చంపత్ రాయ్ రాజీనామా చేశారు. అయితే, తనపై వస్తోన్న ఆరోపణలు నిరాధారమని ఆయన పేర్కొన్నారు.

# యువతకు భారీ కానుక

(మొదటి పేజీ తరువాయి)

కూడా ప్రభుత్వం ప్రకటించింది. యువతలో క్రీడలు, సంస్కృతి, శాస్త్రీయ స్ఫూర్తి, మత మరియు సామాజిక సామరస్యాన్ని పెంపొందించడానికి భారత్ జోడో యూత్ అసోసియేషన్లను స్థాపించాలని నిర్ణయించారు. ఈ పథకాన్ని రూ. 1,000 కోట్ల వ్యయంతో అమలు చేయడానికి ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఇందులో భాగంగా ప్రతి అసోసియేషన్‌కు ఏటా రూ. 10 లక్షలు కేటాయించారు. యువతలో క్రీడలు, సంస్కృతి, శాస్త్రీయ దృక్పథం, సామాజిక సామరస్యాన్ని పెంపొందించేందుకు గ్రామ పంచాయతీలు, పట్టణ వార్డుల పరిధిలో 10,000 భారత్ జోడో యూత్ అసోసియేషన్లను ఏర్పాటు చేయాలని అధికారిక ఉత్తర్వులు జారీ చేశామని ఉప ముఖ్యమంత్రి జి. పరమేశ్వర ట్విట్టర్‌లో పోస్ట్ చేశారు."ప్రతి గ్రామ పంచాయతీలో ఒక సంఘం, ప్రతి టౌన్ పంచాయతీలో సగటున 4,000 జనాభాకు ఒక సంఘం, ప్రతి మున్సిపాలిటీలో సగటున 6,000 జనాభాకు ఒక సంఘం, ప్రతి మున్సిపాలిటీలో సగటున 8,000 జనాభాకు ఒక సంఘం, మరియు మెట్రోపాలిటన్ సిటీ, జీబీఏ ప్రాంతాలలో సగటున 10,000 జనాభాకు ఒక సంఘం ఏర్పాటు చేయాలని మేము ఆదేశాలు జారీ చేశాము," అని ఆయన అన్నారు. ఈ పథకాన్ని యువజన సాధికారత మరియు క్రీడల శాఖ ద్వారా అమలు చేయనున్నారు. ఇందులో గ్రామీణాభివృద్ధి మరియు పంచాయతీ రాజ్ శాఖ, పట్టణాభివృద్ధి శాఖ, రెవెన్యూ శాఖ మరియు విద్యా శాఖలు సహకరిస్తాయి. భారత్ జోడో యూత్ అసోసియేషన్ల ద్వారా యువతలో నాయకత్వ లక్షణాలను పెంపొందించి, వారికి సాధికారత కల్పించి, దేశానికి మంచి పౌరులుగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి అన్నారు.

# కేంద్ర విద్యాశాఖ మంత్రి తప్పుకోవాలి

(మొదటి పేజీ తరువాయి)

సోమవారం సీపీఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యులు, ఎంపీ అమ్రారామ్, తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ, సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు ఎస్ వీరయ్య,టి.జ్యోతి, అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి బి.వెంకట్, సీఐటీయూ అఖిల భారత కోశాధికారి ఎం. సాయిబాబు, సీపీఐ(ఎం) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, లోకనాథం, డి.రమాదేవి, సందర్శించారు. ఈ సందర్భంగా వారు సోనమ్ వాంగ్‌చుక్‌ను పరామర్శించి, సంపూర్ణ సంఘీభావం ప్రకటించారు. అనంతరం సీజేపీ వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కేతో సమావేశమై ఉద్యమ పరిస్థితులను, భవిష్యతనెలార్యాచరణను చర్చించారు. దీక్షా శిబిరంలో ఉన్న విద్యార్థులు, యువత, ప్రజలకు నాయకులు అభివాదం చేశారు. అలాగే ఎస్ఎఫ్ఐ ఏర్పాటు చేసిన 'క్రాంతి వేదిక'ను సందర్శించారు. ఈ సందర్భంగా పొలిట్ బ్యూరో సభ్యులు, ఎంపీ అమ్రారామ్ మాట్లాడుతూ విద్యను కార్పొరేట్ శక్తులకు అప్పగిస్తూ, పరీక్షల నిర్వహణలో తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్న మోడీ ప్రభుత్వ విధానాల వల్ల దేశ యువత భవిష్యత్తు ప్రమాదంలో పడిందన్నారు. సోనమ్ వాంగ్‌చుక్ ఉద్యమానికి సీపీఐ(ఎం) దేశ వ్యాప్తంగా సంపూర్ణ మద్దతు ప్రకటిస్తోందని తెలిపారు. ఈ సమస్యను పార్లమెంట్‌లో బలంగా లేవనెత్తి కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీస్తామని చెప్పారు. ఈ నెల 20న నిర్వహించనున్న 'చలో పార్లమెంట్' కార్యక్రమానికి సీపీఐ(ఎం) పూర్తి మద్దతు ఇస్తుందని ఆయన ప్రకటించారు.

# లోపాలు సరిదిద్దాకే ముందుకెళ్తాం

(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణ ప్రభుత్వం తొలిసారి సుప్రీంకోర్టును ఆశ్రయించిన విషయం విదితమే. ఈ రిట్ పిటిషన్ లో కేంద్ర ప్రభుత్వంతో పాటు ఏపీ, కర్నాటక, మహారాష్ట్ర, ఛత్తీస్ గఢ్, ఒడిశా, మధ్యప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వాలు, పోలవరం ప్రాజెక్ట్ అథారిటీ(పీపీఏ), గోదావరి, కృష్ణా రివర్ మేనేజ్మెంట్ బోర్డులు, సెంట్రల్ వాటర్ కమిషన్ (సీడబ్ల్యూసీ) ఇలా మొత్తం 13 మందిని ప్రతివాదులుగా చేసింది. అయితే ఈ పిటిషన్ లో పలు లోపాలు ఉన్నాయని పేర్కొంటూ కోర్టు ప్రాథమిక దశలోనే విచారణను తిరస్కరించింది. అంతేకాక ఈ పిటిషన్ విచారణకు అర్హత లేదనీ, దీనిపై ఒరిజినల్ సూట్ వేసుకోవాలని స్పష్టం చేసింది. ఈనేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం సైతం రిట్ పిటిషన్ ను ఉపసంహరించుకుంది. కోర్టు ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం తరపున సుమంత్ నూకల మధ్యంతర పిటిషన్ (ఐఏ) దాఖలు చేసింది. ఈ ఐఏపై జస్టిస్ ఎన్.వి అంజరియ(ఛాంబర్ బెంచ్) మే 22న ఛాంబర్ కోర్టులో విచారణ జరిపింది. ఈ సందర్భంగా రీ--ఫైలింగ్ లో జరిగిన జాప్యాన్ని మన్నిస్తూనే, ఐఏను అనుమతించింది. దీని ఆధారంగా ఒరిజినల్ సూట్ ను కోర్టు వెకేషన్ తర్వాత రెగ్యులర్ బెంచ్ విచారించనుందని ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈ ఒరిజినల్ సూట్ ను సోమవారం జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతాల నేతృత్వంలోని ద్విసభ్య ధర్మాసనం విచారించింది. తెలంగాణ ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాదులు అభిషేక్ మనుసింఘ్వీ, గోపాల శంకర్ నారాయణ, తెలంగాణ అడ్వకేట్ జనరల్ సుదర్శన్ రెడ్డిలు హాజరయ్యారు.

## బద్రీనాథ్ విరాళాల చోరీ కేసులో
# ప్రధాన నిందితుడు అరెస్ట్

(మొదటి పేజీ తరువాయి)

వెల్లడించారు. నిందితుడిని పోలీసు కస్టడీకి ఇవ్వాలని కోర్టును సిట్ కోరనుంది.

**సీసీటీవీలో అనుమానాస్పద కదలికలు**

జులై 2న ఆలయ హుండీ విరాళాల లెక్కింపు సందర్భంగా తీసిన సీసీటీవీ దృశ్యాల్లో ప్రమోద్ నౌటియాల్ అనుమానాస్పదంగా ప్రవర్తించినట్టు పోలీసులు తెలిపారు. రూ.500, రూ.100 నోట్ల కట్టలు, బంగారం, వెండి నాణేలు, శాలిగ్రామ రాళ్లు, భక్తులు సమర్పించిన కానుకల కవర్లను తీసుకుంటున్నట్టు వీడియోల్లో కనిపించిందని పేర్కొన్నారు. లెక్కింపు గది నుంచి తన కార్యాలయానికి రెండు నుంచి మూడు సార్లు వెళ్లి వచ్చినట్టు కూడా సీసీటీవీ ఫుటేజీలో గుర్తించినట్లు తెలిపారు. దొంగిలించిన నగదు, విలువైన వస్తువులను తన కార్యాలయంలో దాచివేసి ఉండవచ్చని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

**లెక్కింపులో వెలుగులోకి వచ్చిన అక్రమాలు**

బద్రీనాథ్ ఆలయంలో విరాళాల లెక్కింపు సమయంలో అక్రమాలు జరిగాయంటూ సోషల్ మీడియాలో వెల్లువెత్తాయి. దీంతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ఆ తర్వాత భైరవ్ సేన అనే సంస్థ ఈ వ్యవహారంపై విచారణ జరిపించాలని, నిందితులపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేసింది. ఆ తర్వాత జులై 2న విరాళాల లెక్కింపు సమయంలో నిబంధనలకు విరుద్ధంగా నగదును చోరీ చేసినట్లు ప్రాథమిక విచారణలో తేలింది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేసి సమగ్ర విచారణకు ఆదేశించింది. బీకేటీసీ ఇన్‌చార్జి టెంపుల్ ఆఫీసర్ యుధ్‌వీర్ పుష్పవాన్ ఫిర్యాదు మేరకు బద్రీనాథ్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. ఆయనతో పాటు సీసీటీవీ కంట్రోల్ అధికారి పన్వార్, విరాళాల లెక్కింపు సమయంలో అక్కడే ఉన్న హరేంద్ర కోఠారి తదితరుల వాంగ్మూలాలను కూడా సిట్ నమోదు చేసింది.

ఆ తర్వాత గర్వాల్ డివిజన్ కమిషనర్ ఈ కమిటీకి ఛైర్మెన్ నేతృత్వంలో ఒక త్రిసభ్య విచారణ కమిటీని ఏర్పాటు చేసింది ప్రభుత్వం. ఈ కమిటీ తన విచారణ అంశాలను, సిఫారసులను 15 రోజుల్లోగా రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పి స్తుందని అధికారులు తెలిపారు. ఈ కేసును రాష్ట్ర పోలీసు లు, ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్), బీకేటీసీ శాఖాపర విచారణ కమిటీ, గఢ్వాల్ కమిషనర్ నేతృత్వంలోని ఉన్నతస్థాయి కమిటీ సమాంతరంగా దర్యాప్తు చేస్తున్నాయి. ఈ కమిటీ తన విచారణ అంశాలను, సిఫారసు లను 15 రోజుల్లోగా రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పిస్తుందని అధికారులు తెలిపారు. దీంతో మరిన్ని కీలక విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు.

**హైకోర్టును ఆశ్రయించిన నిందితుడు**

తనపై విధించిన సస్పెన్షన్‌తో పాటు నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌ను సవాల్ చేస్తూ ప్రమోద్ నౌటియాల్ ఉత్తరాఖండ్ హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌ను విచారించిన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ మెహ్రా, బీకేటీసీ నుంచి సమాధానం దాఖలు చేయాలని ఆదేశించారు. తదుపరి విచారణను జులై 16కు వాయిదా వేశారు.

# గోదావరి డెల్టాకు శాశ్వత భద్రత

(మొదటి పేజీ తరువాయి)

అధికారులు బాధ్యత తీసుకోవాలని ముఖ్యమంత్రి దిశా నిర్దేశం చేశారు. అనంతరం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట నియోజకవర్గంలోని పిచ్చుకలంకలో రైతులతో నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గోదావరి డెల్టాకు దేశానికే అన్నపూర్ణ అనే ఖ్యాతి రావడానికి సర్ ఆర్థర్ కాటన్ నిర్మించిన ఆనకట్టే కారణమని, అనంతరం ఎన్టీఆర్ హయాంలో నిర్మించిన కొత్త బ్యారేజీతో మరో పంటకు సాగునీరు అందించే అవకాశం ఏర్పడిందని చంద్రబాబు గుర్తుచేశారు. 2.9 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యం, 32.2 లక్షల క్యూసెక్కుల వరదను తట్టుకునే సామర్థ్యంతో పాటు ఈస్ట్రన్, సెంట్రల్, వెస్ట్రన్ డెల్టాల్లో కలిపి 10.13 లక్షల ఎకరాలకు సాగునీరు అందేలా బ్యారేజీ ఉపయోగపడుతోందన్నారు. అయితే 50 ఏళ్లకు పైగా గేట్లు, మోటార్లు, విద్యుత్ వ్యవస్థలు పాతబడటంతో వాటి ఆధునీకరణ అత్యవసరమైందని ముఖ్యమంత్రి చెప్పారు. 2014-19 మధ్య టీడీపీ ప్రభుత్వం రూ.32 కోట్లతో కొత్త గేట్లను అమర్చిందని, ఇప్పుడు మిగిలిన పాత గేట్ల స్థానంలో 117 కొత్త గేట్లను తొమ్మిది నెలల్లో అమర్చేలా చర్యలు ప్రారంభించామని సీఎం తెలిపారు. గత పాలకులు ఇరిగేషన్ ప్రాజెక్టులను కనీస నిర్వహణ కూడా చేపట్టలేదని విమర్శించారు. గేట్లు కొట్టుకుపోయినా పట్టించుకోలేదని... కనీసం గ్రీజ్ పెట్టేందుకు అవసరమైన నిధులను కూడా గత పాలకులు ఇవ్వలేదని ముఖ్యమంత్రి అన్నారు. తుంగభద్ర ప్రాజెక్టుకు మొత్తంగా కొత్త గేట్లను బిగించామని వివరించారు. తాము గత రెండేళ్లలోనే సాగునీటి రంగానికి రూ.24 వేల కోట్లు వెచ్చించామని ముఖ్యమంత్రి తెలిపారు.పోలవరం నిర్వాసితులను ఆనందంగా ఉంచుతాం.ఒకప్పుడు కోనసీమలో వరికి మద్దతు ధర లేక రైతులు క్రాప్ హాలిడే ప్రకటించే పరిస్థితి నెలకొంటే, ఇప్పుడు రైతుల ధాన్యానికి గిట్టుబాటు ధరతో పాటు విక్రయించిన 24 గంటల్లోనే డబ్బులు వారి ఖాతాల్లో జమ చేస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. రైతు సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందని, అన్నదాత సుఖీభవ పథకాన్ని అమలు చేస్తున్నామని చెప్పారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో గత ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శించిందని సీఎం విమర్శించారు.

2014-19 మధ్య 72 శాతం పనులు పూర్తిచేయగా, ఆ తర్వాత ఐదేళ్లలో కేవలం 2 శాతం పనులు మాత్రమే జరిగాయని అన్నారు. టీడీపీ ప్రభుత్వం కొనసాగి ఉంటే 2021 నాటికే పోలవరం పూర్తయ్యేదని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పనులు వేగవంతమై ప్రస్తుతం 89 శాతం పురోగతి సాధించామని తెలిపారు. నిర్వాసితులకు పూర్తి న్యాయం చేస్తామని, పునరావాసం, పరిహారం విషయంలో ఎలాంటి రాజీ ఉండదన్నారు. వారిని ఆనందంగా ఉంచుతామని... అనుకున్న సమయానికి పోలవరం ప్రాజెక్టును జాతికి అంకితం చేస్తామని సీఎం చంద్రబాబు ప్రకటించారు. ప్రకటించిన క్యాలెండర్ కు అనుగుణంగా ఇరిగేషన్ ప్రాజెక్ట్ పనులు చేపడుతోందని చెప్పారు. పోలవరం పూర్తయితే గోదావరి జిల్లాలకు నీటి సమస్య శాశ్వతంగా తీరుతుందని, పట్టిసీమ ద్వారా గోదావరి జలాలను కృష్ణా డెల్టా, రాయలసీమకు తరలించి అక్కడి వ్యవసాయ రూపురేఖలనే మార్చామని ముఖ్యమంత్రి వివరించారు. మైక్రో ఇరిగేషన్ విస్తరించడంతో ఉద్యాన పంటలు అభివృద్ధి చెందాయని, పరిశ్రమలకు నీటి సరఫరా సాధ్యమై కియా వంటి భారీ పరిశ్రమలు రాయలసీమకు వచ్చాయని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.కూటమిపై గోదావరి జిల్లాల ప్రజల అభిమానం తరగనిదిగోదావరి ప్రజలు అభివృద్ధిని ఆదరించే స్వభావం కలవారని, గతంలోనూ టీడీపీకి అపూర్వ ఆదరణ ఇచ్చారని చంద్రబాబు గుర్తు చేశారు. 2024 ఎన్నికల్లో కూటమికి ఇచ్చిన భారీ విజయాన్ని రాష్ట్ర అభివృద్ధికి ఇచ్చిన ఆశీర్వాదంగా భావిస్తున్నామని పేర్కొన్నారు. ప్రజల సహకారం, భగవంతుడి ఆశీస్సులతో ఆర్థిక సవాళ్లను అధిగమించి రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపిస్తామని ముఖ్యమంత్రి చెప్పారు. గోదావరి పుష్కరాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, పుష్కర ఘాట్ల అభివృద్ధితో పాటు రాజమహేంద్రవరం పరిసర ప్రాంతాల్లో సుమారు రూ.1,200 కోట్లతో మౌలిక వసతులు కల్పించనున్నట్లు వెల్లడించారు. పిచ్చుకలంక, బొబ్బర్లంక ప్రాంతాలను పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేస్తామని, కోనసీమకు రైల్వే లైన్ తీసుకొచ్చేందుకు కృషి చేస్తామని చెప్పారు. కోవ్వూరులో కోకో సిటీ ఏర్పాటు చేయనున్నట్లు కూడా ప్రకటించారు. ఆక్వా రైతులకు యూనిట్‌కు రూ.1.50కే విద్యుత్ అందిస్తున్నామని, మెట్ట ప్రాంతాల్లో పామాయిల్, కోకో సాగుకు ప్రభుత్వం ప్రోత్సాహం ఇస్తోందని చెప్పారు. వాతావరణ మార్పులు, ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తగ్గుతున్న నేపథ్యంలో రైతులు పంటల ఎంపికలో శాస్త్రీయ విధానాలు అనుసరించాలని సీఎం సూచించారు.అభివృద్ధి-సంక్షేమమే కూటమి లక్ష్యంరాష్ట్ర పునర్నిర్మాణమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, ప్రధాని నరేంద్ర మోదీ, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌తో కలిసి ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చుతున్నామని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ నెలలోనే తల్లికి వందనం నిధులు జమ చేస్తామని, సామాజిక భద్రత పెన్షన్లు, రైతు సంక్షేమ కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతున్నాయని తెలిపారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఇటీవల శస్త్రచికిత్స చేయించుకున్నప్పటికీ ప్రజల మధ్యకే రావాలనే తపనతో ఉన్నారని, ముంబై వెళ్లి ఆయనను పరామర్శించి పూర్తిగా కోలుకున్న తర్వాతే ప్రజాసేవలో పాల్గొనాలని సూచించినట్లు చెప్పారు. రాష్ట్రంలో గంజాయి, డ్రగ్స్, రౌడీయిజంపై రాజీపడబోమని సీఎం హెచ్చరించారు. మహిళలపై అసభ్యకర వ్యాఖ్యలు, వ్యక్తిత్వ హననం, సోషల్ మీడియా దుర్వినియోగాన్ని ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తోందన్నారు. గంజాయిని ప్రోత్సహించే వారిపైనా, మహిళలను కించపరిచే వారిపైనా కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. రౌడీలతో, బ్లేడ్ బ్యాచ్, గంజాయి బ్యాచ్ లను మించి గొడ్డలి పార్టీతోనే సమస్యలు సృష్టిస్తోందని సీఎం మండిపడ్డారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కుటుంబ సభ్యులపై అసభ్యంగా మాట్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యక్తిత్వ హననానికి పాల్పడుతున్నారని... ఆడవాళ్లని అసభ్యంగా మాట్లాడే వారిని గొడ్డలి పార్టీ సమర్థిస్తోందని విమర్శించారు. సోషల్ మీడియాను దుర్వినియోగం చేస్తూ... గొడ్డలి పార్టీ నేతలు ఫైనాన్స్ చేస్తున్నారు.. స్టూడియోలు పెట్టిస్తున్నారని విమర్శించారు. గంజాయి, బ్లేడ్ బ్యాచ్ లను గొడ్డలి పార్టీ సపోర్ట్ చేస్తోందని... వారికి డబ్బులిచ్చి ప్రొత్సహిస్తోందని ముఖ్యమంత్రి చెప్పారు. వీళ్లపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని సీఎం చంద్రబాబు వెల్లడించారు.

ఈ కార్యక్రమంలో మంత్రులు నిమ్మల రామానాయుడు, కందుల దుర్గేష్, పొంగూరు నారాయణ, వాసంశెట్టి సుభాష్, ఎంపీ గంటి హరీష్, స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# రాష్ట్ర ప్రయోజనాలే ముఖ్యం

(మొదటి పేజీ తరువాయి)

ఐఐఎం ఏర్పాటుకు కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌ను కలిసి మంజూరు కోసం విజ్ఞప్తి చేయాలని చెప్పారు. హైదరాబాద్ మెట్రో ఫేజ్-× స్వాధీనం, ఫేజ్-×× విస్తరణకు సంబంధించి ఎస్బీఐక్యాబ్స్‌ను కన్సల్టెంట్‌గా నియమించేందుకు కేంద్ర ప్రభుత్వం అంగీకరించిందనీ, ఆ ప్రక్రియ త్వరగా ముందుకు సాగేలా చూడాలని సూచించారు. దీనికి బీజేపీ ఎంపీలు ఈటల రాజేందర్, కొండా విశ్వేశ్వర్ రెడ్డి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగంలో పనుల ప్రారంభానికీ, దక్షిణ భాగం భూ సేకరణకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం కోసం యత్నించాలని సూచించారు. మూసీ పునరుజ్జీవం పనులను అర్బన్ ఛాలెంజ్ ఫండ్ కింద తీసుకునే విషయంలో కేంద్ర అనుమతి కోసం ఆ శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్‌ను కలిసి విజ్ఞప్తి చేయాలన్నారు. తుంగభద్ర ప్రాజెక్టు నుంచి తెలంగాణకు 15.09 టీఎంసీల నీరు రావాల్సి ఉన్నా, పూడికతో 5 టీఎంసీలకు మించి రావడం లేదన్నారు. పూడిక తొలగింపునకు ఏపీ, కర్ణాటకను ఒప్పించాలని సీఆర్ పాటిల్‌ను కోరామనీ, ఈ విషయంపైనా ఎంపీలు కేంద్ర మంత్రిని కలవాలని సూచించారు. గోదావరిలో ఛత్తీస్‌గఢ్‌కు ఉన్న 300 టీఎంసీల నీటిని ఆ రాష్ట్రం వాడుకోవడం లేదన్నారు. భవిష్యత్‌లో 160 టీఎంసీలు వాడుకున్నా 143 టీఎంసీలు మిగులు ఉంటాయనీ, అందులో తెలంగాణకు 43 టీఎంసీలు లభించే అవకాశం ఉందన్నారు. నదుల అనుసంధానంలో గోదావరి నుంచి నాగార్జున సాగర్‌కు నీళ్లు తీసుకునే విషయంలో ఛత్తీస్‌గఢ్‌ను ఒప్పించే బాధ్యత కేంద్ర ప్రభుత్వం తీసుకుందని తెలిపారు. ఆ రెండింటిని రాష్ట్రానికి అనుకూలంగా సాధించాలని సీఎం అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో ప్రారంభించిన ప్రాజెక్టులకు ఏపీ నుంచి నిరభ్యంతర పత్రాలు వస్తే వాటికి ఉన్న అడ్డంకులు తొలగిపోతాయని అన్నారు. తుమ్మిడిహట్టి ప్రాజెక్టుకు సంబంధించి 150 నుంచి151 అడుగుల్లో నిర్మించేందుకు మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఫడ్నవీస్‌తో భేటీ అవుదామని ఎంపీలతో సీఎం అన్నారు. శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ నుంచి బెంగుళూరు, చెన్నై, ముంబయిలకు వెళ్లే బుల్లెట్ రైళ్లు, ఆదిలాబాద్ డిఫెన్స్ ఎయిర్‌పోర్ట్, వరంగల్ ఎయిర్‌పోర్ట్‌లకు అవసరమైన భూ సేకరణ పూర్తి చేశామన్నారు. ఎంపీలు వాటిపై దృష్టి పెట్టాలని కోరారు. పార్టీలకతీతంగా ఎంపీలకు అవసరమైన సమాచారం అందిస్తూ, సమన్వయం చేసుకోవడానికి ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో ఐఏఎస్ అధికారి అద్వైత్ కుమార్ సింగ్‌ను నియమించామని తెలిపారు. పెండింగ్ అంశాలకు సంబంధించి ఏ సమాచారం కావాలన్నా ఆయన దగ్గర నుంచి తీసుకోవాలని సూచించారు. అన్ని పార్టీల ఎంపీలను సమన్వయం చేసుకుని ముందుకు సాగాలని మల్లు రవికి సీఎం సూచించారు. రాష్ట్రంలో పండే ధాన్యానికి తగిన మిల్లింగ్ సామర్థ్యం లేదనీ, స్టోరేజీ సమస్య ఉందని ఈటల రాజేందర్ అన్నారు. ప్రొటోకాల్ విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గద్వాల దగ్గర మూతపడిన ఆయిల్ మిల్లు పునరుద్ధరణపై మల్లు రవి అధికా రులను ప్రశ్నించారు. ఏడెనిమిది నెలల్లో పునరుద్ధరణ పూర్తవుతుందని అధికారులు తెలిపారు. పార్లమెంట్‌లో ప్రశ్నలు వేయడానికి వీలుగా ఈ సమావేశాలు చాలా ముందుగా ఏర్పాటుచేయాలని చామల కిరణ్ కుమార్ రెడ్డి కోరారు. ఎంపీలంతా ఏదో ఒక స్టాండింగ్ కమిటీ, కన్సల్టెన్సీ కమిటీల్లో సభ్యులుగా ఉంటారనీ, ఆ సమాచారం తీసు కుని ఆయా అంశాలకు సంబం ధించిన పెండింగ్ విష యాలు తెలియజేస్తే పార్లమెంట్ సమావేశాల్లో తాము చర్చించేందుకు వీలుంటుందని రామసహాయం రఘురామిరెడ్డి అన్నారు.

**ప్రాజెక్టులపై నిపుణుల కమిటీ వేయండి-బీజేపీ ఎంపీలు**

కాళేశ్వరం, పాలమూరు-రంగారెడ్డి డిజైన్లలోనే లోపాలున్నాయని బీజేపీ ఎంపీలు కొండా విశ్వేశ్వరరెడ్డి, ఈటల రాజేందర్ అన్నారు. దీనిపై నిపుణులతో కమిటీ వేసి అధ్యయనం చేయించాలని కోరారు. దీనికి సీఎం ఏ రేవంత్‌రెడ్డి సానుకూలంగా స్పందించారు. సమావేశంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఎంపీలు కడియం కావ్య, రామసహాయం రఘురామిరెడ్డి, చామల కిరణ్ కిమార్ రెడ్డి, రఘువీర్ రెడ్డి, అనిల్ కుమార్ యాదవ్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

Truth of News
సూర్య వాస్తవం
http://www.suryavastavam.in
మంగళవారం
14 జూలై 2026


# సంపాదకీయం

## డిఫెన్స్ రంగంలోకి భారత్




వాస్తవానికి ప్రపంచ ఆర్థిక శక్తిగా అమెరికా ఉంది. తర్వాత స్థానంలో చైనా ఉంది. రష్యా గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. కానీ ఈ జాబితాలో ఇండియా వచ్చి చేరింది. ఆర్థికంగా బలోపేతమైన స్థానంలో ఉంది. ఇప్పుడు డిఫెన్స్ రంగంలో కూడా భారత్ సరికొత్త చరిత్ర సృష్టిస్తోంది. ఏకంగా చైనా కు దిమ్మ తిరిగే విధంగా షాకిచ్చింది.కొంతకాలం గా డిఫెన్స్ రంగంలో భారత్ అనేక రకాలుగా ప్రయోగాలు చేస్తోంది. కొత్త కొత్త ఆయుధాలను రూపొందిస్తుంది. వివిధ దేశాలతో ఒప్పందాలు కూడా కుదుర్చుకుంటున్నది. తన ఆయుధ శక్తిని ఇటీవల కాలంలో ఆపరేషన్ సిందూర్ సమయంలో భారత్ ప్రదర్శించింది. పాకిస్తాన్ లో ఉగ్రవాద శిబిరాల మీద దాడులు చేసింది. ఖచ్చితమైన లక్ష్యాల మీద దాడులు చేసి భారత్ తన స్థాయిని నిరూపించుకుంది. అయితే ఇక్కడితోనే భారత్ ఆగిపోవడం లేదు. ఏకంగా ప్రపంచ ఆయుధ శక్తులుగా వెలుగొందుతున్న అమెరికా, రష్యా తర్వాత భారత్ స్థానాన్ని సంపాదించుకుంది.భారతస్థాయిని డబ్ల్యూడిఎంఎంఏ సంస్థ తన వార్షిక ర్యాంకింగ్ ల ద్వారా ప్రకటించింది. ఈ జాబితాలో భారత్ మూడో స్థానంలో ఉండడం విశేషం. ఆధునికీకరణ.. లాజిస్టికల్ మద్దతు.. పరస్పరంగా చేసే దాడులు.. రక్షణ సామర్థ్యాలు వంటి ఆధారంగా ఈ రేటింగ్ ఇచ్చింది. ప్రత్యేకమైన మిషన్, ప్రత్యేకమైన బాంబర్ దళం, సిఏఎస్ శిక్షణ.. వంటి వాటిని డబ్ల్యూ డి ఎం ఎం ఏ పరిధిలోకి తీసుకుంది. ఇందులో అత్యధికంగా టీవీఆర్ స్కోర్ 242.9. దీనిని యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా సాధించింది. ఆ తర్వాత స్థానంలో రష్యా ఉంది. రష్యా తర్వాత భారత్ కొనసాగుతోంది.టీవీఆర్ రేటింగ్స్ ప్రకారం చూసుకుంటే యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా 242.9 పాయింట్లు తో మొదటి స్థానంలో ఉంది. రెండో స్థానంలో యునైటెడ్ స్టేట్స్ నేవీ విభాగం కొనసాగుతోంది. నేవీ విభాగానికి 142.4 టీవీఆర్ రేటింగ్ ఉంది. తర్వాత స్థానంలో 114.2రేటింగ్ తో రష్యన్ వైమానిక దళం కొనసాగుతోంది.. 112.6 టీవీఆర్ రేటింగ్ తో యునైటెడ్ స్టేట్స్ ఆర్మీ కొనసాగుతోంది. 85.3 టీవీఆర్ రేటింగ్ తో యునైటెడ్ స్టేట్స్ మెరైన్స్ కొనసాగుతోంది. భారత వైమానిక దళం 64.9 టివిఆర్ రేటింగ్ తో ఆరవ స్థానంలో కొనసాగుతోంది.. వాస్తవానికి దేశాల ప్రకారం చూసుకుంటే అమెరికా మొదటి స్థానంలో.. రష్యా రెండవ స్థానంలో.. ఇండియా మూడో స్థానంలో ఉంది. 63.8 టివిఆర్ రేటింగ్ తో చైనా నాలుగో స్థానంలో.. ర్యాంకు పరంగా ఏడవ స్థానంలో ఉంది. పరేషన్ సిందూర్ తర్వాత భారత్ సొంత రక్షణపై మరింత దృష్టిపెట్టింది. స్వదేశీ ఆయుధాల తయారీకి ప్రాధాన్యం ఇస్తోంది. ఈ క్రమంలో సరికొత్త ఆయుధాలను వేగంగా తయారు చేస్తోంది. ఇక ఇటీవలికాలంలో సముద్ర రక్షణపైనా మోదీ దృష్టి పెట్టారు. ఈమేరకు వివిధ దేశాలలో పర్యటిస్తూ.. సముద్ర రక్షణకు చర్యలు తీసుకుంటున్నారు. మరోవైపు భారత నౌకాదళాన్ని బలోపేతం చేస్తున్నారు. ఇందులో భాగంగా ఐఎన్ఎస్ మహేంద్రగిరిని రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ జాతికి అంకితం చేశారు. ప్రాజెక్ట్ 17ఏ కింద నిర్మించిన ఈ స్వదేశీ స్టెల్త్ ఫ్రిగేట్ భారతదేశ రక్షణ ఉత్పత్తి సామర్థ్యానికి మరో ముఖ్యమైన ఉదాహరణగా నిలిచింది. ఇది కేవలం ఒక నౌక కమిషనింగ్ మాత్రమే కాదు, ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యం వైపు సాగుతున్న ప్రయాణంలో ఒక మైలురాయి.ఈ యుద్ధనౌక స్టెల్త్ టెక్నాలజీతో తయారైంది. దీని రూపకల్పనతో శత్రు రాడార్ల నుంచి సులభంగా గుర్తించడం కష్టం. బ్రహ్మోస్ సూపర్‌సోనిక్ క్షిపణులు, అధునాతన గగనతల రక్షణ వ్యవస్థలు, జలాంతర్గామి వ్యతిరేక యుద్ధ సామర్థ్యాలు దీనిలో భాగం. ఇవి బహుముఖ యుద్ధ పరిస్థితుల్లో నౌకను అత్యంత సమర్థవంతంగా మార్చుతాయి. ఆధునిక ఆయుధ వ్యవస్థలతో సన్నద్ధమైన ఈ ఫ్రిగేట్ భారత నౌకాదళం మొత్తం సామర్థ్యాన్ని పెంచుతుంది.

ఐఎన్ఎస్ మహేంద్రగిరి ప్రాజెక్ట్ 17ఏ కింద నిర్మించిన ఆరవ స్టెల్త్ ఫ్రిగేట్. ఈ ప్రాజెక్టు ద్వారా భారతదేశం విదేశీ సాంకేతిక సహాయం లేకుండా అధునాతన యుద్ధనౌకలను నిర్మించే సామర్థ్యాన్ని సాధించింది. స్వదేశీ నిర్మాణం వల్ల ఖర్చు తగ్గడమే కాకుండా, సాంకేతిక జ్ఞానం స్వంతం అవుతుంది. ఇది రక్షణ రంగంలో ఆత్మనిర్భరతను పటిష్టం చేస్తుంది, భవిష్యత్తులో మరిన్ని నౌకల నిర్మాణానికి పునాది వేస్తుంది.రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ హిందూ మహాసముద్రంలో శాంతి, స్థిరత్వానికి భారతదేశం ఒక ముఖ్యమైన భరోసాగా వ్యవహరిస్తున్నట్లు పేర్కొన్నారు. దేశ వాణిజ్యంలో 90 శాతం కంటే ఎక్కువ సముద్ర మార్గాల ద్వారా జరుగుతుంది. అందువల్ల సముద్ర భద్రతను కాపాడడం ఆర్థిక వృద్ధికి, జాతీయ భద్రతకు అవసరం. భవిష్యత్ యుద్ధాల్లో కొత్త సాంకేతికతలను స్వీకరించాలని సైనిక బలగాలకు రాజ్‌నాథ్‌సింగ్ సూచించారు. ఇది కేవలం ప్రస్తుత సవాళ్లను ఎదుర్కొనడానికి మాత్రమే కాకుండా, రేపటి మారుతున్న యుద్ధ వ్యూహాలకు సిద్ధం కావడానికి కూడా ముఖ్యం.ఐఎన్ఎస్ మహేంద్రగిరి ఆగమనం భారతదేశం సముద్ర రక్షణ వ్యూహాన్ని బలపరుస్తుంది. హిందూ మహాసముద్రంలో పెరుగుతున్న ఉద్రిక్తతల నేపథ్యంలో, అధునాతన స్టెల్త్ ఫ్రిగేట్లు భారత్‌ను 'నెట్ సెక్యూరిటీ ప్రొవైడర్'గా మార్చడానికి సహాయపడతాయి. స్వదేశీ నిర్మాణం ఆర్థికంగా లాభదాయకం మాత్రమే కాకుండా, విదేశీ ఆధారిత్వాన్ని తగ్గిస్తుంది. భవిష్యత్తులో సముద్ర యుద్ధాలు మరింత సాంకేతికంగా మారే అవకాశం ఉంది. సముద్ర భద్రతను కాపాడడం ద్వారా భారతదేశం తన ఆర్థిక ప్రయోజనాలను రక్షించుకోవడమే కాకుండా, ప్రాంతీయ శాంతిని కాపాడే బాధ్యతను కూడా నెరవేర్చగలుగుతుంది.కొంతకాలంగా డిఫెన్స్ రంగంలో భారీగా పెట్టుబడులు పెడుతోంది. రీసర్చ్ అండ్ డెవలప్మెంట్ వింగ్ ను పూర్తిగా ఆధునికరిస్తోంది. కొత్త కొత్త ఆయుధాలను.. యుద్ధ విమానాలను.. మిస్సైల్స్ ను తయారు చేస్తోంది. అందువల్లే ఇండియా మూడో స్థానంలో ఉంది. ఇదే రేంజ్ గనక కొనసాగిస్తే భారత్ రష్యా స్థానాన్ని ఆక్రమించే అవకాశం ఉందని డిఫెన్స్ రంగ నిపుణులు పేర్కొంటున్నారు.

# రావణ్ చుట్టూ రాజకీయం

**- రంగంలోకి ప్రకాష్ రాజ్, గగన...**
**దూరం పెడుతున్న జడ**




**విజయవాడ –సూర్య వాస్తవం:**
గత 10 రోజుల నుండి సోషల్ మీడియా , ఎలక్ట్రానిక్ మీడియా లో 'ప్రశ్న రావణ్' పేరు ఏ రేంజ్ లో మారుమోగిపోతుందో చూస్తూనే ఉన్నాం. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పై పీకలదాకా నిండిన ద్వేషం తో , ఇష్టమొచ్చినట్టు బూతులు మాట్లాడడమే కాకుండా, హిందూ దేవుళ్లను దూషించడం, టెర్రరిస్టులకు , నక్సలైట్లకు సపోర్టుగా వీడియోలు చేయడం వంటివి చేసిన ఇతన్ని పోలీసులు ఉపా చట్టం క్రింద కేసులు నమోదు చేశారు. ఇతన్ని అరెస్ట్ చేయడాన్ని అందరూ సామర్ధించారు, ఒక్క వైసీపీ పార్టీ శ్రేణులు , యాంటీ నేషనలిస్ట్ భావాలు గల ప్రకాష్ రాజ్ వంటి వారు తప్ప. అయితే నెల్లూరు జైలు లో రిమాండ్ లో ఉన్నటువంటి రావణ్ మొబైల్ ని పరిశీలించిన పోలీసులకు కొన్ని సంచలన నిజాలు తెలిసాయి , రావణ్ అకృత్యాలు , మోసాలు అన్నీ బయటపడ్డాయి.దీంతో అతనికి సపోర్టు చేసిన వారు ఒక్కొక్కరిగా జారుకున్నారు.

వైసీపీ పార్టీ వాళ్ళు అయితే కొందరు రావణ్ లాంటోళ్లని మేమెందుకు చేరదీస్తామని తప్పుకునే ప్రయత్నం చేయగా, అంబటి రాంబాబు వంటి వారు రావణ్ కి వైసీపీ పార్టీ న్యాయ సహాయం చేస్తామని మాట ఇచ్చారు. మాట ఇవ్వడమే కాదు , న్యాయ సహాయం కూడా చేస్తున్నారు. దీంతో మొదటి నాలుగు కేసుల్లో రావణ్ కి బెయిల్ ఇప్పించిన జడ శ్రవణ్ వంటి వారు కూడా ఈ కేసు నుండి తెలివిగా తప్పుకున్నారు. ప్రకాష్ రాజ్ కూడా సైలెంట్ అవ్వడం తో , అతనికి నిజాలు తెలిసి సైలెంట్ అయిపోయారని

ఇప్పటికైనా బుద్ధితెచ్చుకున్నారని అంతా అనుకున్నారు. కానీ కట్ చేస్తే కాసేపటి క్రితమే ప్రకాష్ రాజ్ విడుదల చేసిన వీడియో సంచలనంగా మారింది. ఈ వీడియో లో ఆయన ఇప్పటికీ రావణ్ తప్పు చేసినట్టుగా ఒప్పుకోవడం లేదు .అతని కోసం అలుపెరుగని పోరాటం చేస్తూనే ఉన్నారు ప్రకాష్ రాజ్. ఆయన మాట్లాడుతూ 'చాలా మంది నేను సైలెంట్ అయిపోయానని అంటున్నారు. నేనేమి సైలెంట్ అవ్వలేదు , మొత్తం చూస్తూ ఉన్నాను, మీరు ఎంత దిగజారిపోతున్నారో గమనిస్తూ ఉన్నాను. అసత్య ప్రచారాలతో నేరుగా ఎమ్మెల్యేలు , ఎంపీలు రంగం లోకి దిగడం, యూట్యూబర్లు , జనసైనికులు, కొన్ని అమ్ముడుపోయిన మీడియా చానెల్స్ చేస్తున్న ప్రచారాలను గమనిస్తున్నాను. వీటి అన్నిటికీ ఒక్కటే సమాధానం చెప్తున్నాను. దిగజారండి , ఇంకా ఇంకా దిగజారుతూనే ఉండండి, మీరు ఎంత దిగజారిన ప్రపంచం మొత్తం మిమ్మల్ని గమనిస్తూనే ఉంది, మీరు ఏమి చేసిన ప్రశ్నించే గొంతుకని ఆపలేరు' అంటూ ఒక వీడియో ని విడుదల చేసాడు ప్రకాష్ రాజ్. దీనిపై నెటిజెన్స్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.

గగన ఎవరు
: ప్రధాన మీడియా పట్టించుకోలేదు. కానీ సోషల్ మీడియా ఊరుకోదు కదా.. లోతుగా తవ్వింది.. అసలు ఏం జరిగింది అని తెలుసుకుంది. చివరికి ప్రశ్న వెనుక ఉన్న అసలు ముసుగును బయటపెట్టింది. తద్వారా నిజం తెలిసింది. ఇంతకీ ఏం జరిగింది.. ఏపీలో ఈ పరిణామం దేనికి దారి తీయ పోతోంది..ఉపా చట్టం కింద బచ్చలకూరి జోసెఫ్ అలియాస్ రావణ్ అరెస్ట్ అయిన విషయం తెలిసిందే. అతడు ప్రస్తుతం నెల్లూరు సెంట్రల్ జైల్లో జ్యుడీషియల్ ఖైదీగా ఉన్నాడు. వాస్తవానికి రావణ్ ఒక్కడే కాదని.. అతను ఒక్కడు ఇదంతా చేయలేదని.. తెర వెనుక చాలా కథ ఉందని పోలీసులు ఇప్పటికే గుర్తించారు. రావణ్ వెనుక ఉన్న అసలు కథను తవ్వితీయడంలో నిమగ్నమై ఉన్నారు. ఈ నేపథ్యంలోనే ఒక మహిళ పేరు తెర మీదికి వచ్చింది. ఆమె పేరు గమన..ఇటీవల వైసిపి అధినేత జగన్ విజయవాడ గన్నవరం విమానాశ్రయంలో కి వచ్చినప్పుడు గమన ఆయనను కలిసింది. అప్పుడు జగన్ ఆమె నెత్తి మీద చేయి పెట్టి ఆశీర్వదించారు. కచ్చితంగా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. దానికి గమన ఉప్పొంగిపోయింది.. ధన్యోస్మి అన్న లెవెల్లో హవ భావాలు ప్రదర్శించింది. జగన్ ను కలిసిన తర్వాత గమన ఎవరు అనే చర్చ మొదలైంది. ఆ తర్వాత పోలీసులు దర్యాప్తు మొదలు పెట్టడంతో గమనకు సంబంధించిన అసలు విషయాలు బయటపడుతున్నాయి.ప్రశ్న యూట్యూబ్ ఛానల్ కు సీఈవోగా గమన వ్యవహరిస్తోంది. ఈ ఛానలకు సంబంధించిన ఫండింగ్ మొత్తం గమన సమకూర్చుతోంది. రావణ్ తో ఆమె అత్యంత సన్నిహితంగా ఉండేది. అతడితో కలిసి రీల్స్.. కాంట్రవర్షల్ పొలిటికల్ వీడియోలు కూడా రూపొందించేది. వైసిపికి అనుకూలంగా ఉండే సోషల్ మీడియా నెట్వర్క్ లో ఈమె తెరవెనుక అత్యంత కీలకపాత్ర పోషించిందని తెలుస్తోందిప్రశ్న యూట్యూబ్ స్టూడియో.. ఇతర కార్యకలాపాలకు సంబంధించిన రాజకీయ లింకులు మొత్తం విచారణలో బయటపడుతున్నాయి.. వైసీపీ కళ్యాణ దుర్గం నియోజకవర్గం మాదినేని ఉమా మహేశ్వర నాయుడు సోదరుడికి సంబంధించిన ఒక ప్లాట్ లో ఈ ఛానల్ స్టూడియో ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది. కాంట్రవర్షల్ కంటెంట్.. ఇతర ప్రొడక్షన్ మొత్తం కూడా అక్కడి నుంచే కొనసాగుతోందని సమాచారం. అయితే దీని వెనుక అతిపెద్ద రాజకీయ కుట్ర కోణం ఉందని పోలీసులు ఇప్పటికే గుర్తించారు. కీలకమైన డేటా మొత్తం స్వీకరించారు. ప్రస్తుతం ఈ కేసు తీవ్రమైన రూపు దాల్చడంతో.. పోలీసులు గమనికు అధికారికంగానే నోటీసులు ఇచ్చారు. రావణ్ మొబైల్ ఫోన్.. లాప్టాప్ మొత్తాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అందులో కీలకమైన సమాచారాన్ని.. వీడియోలను పోలీసులు రికవరీ చేశారు.. ప్రశ్న బృందానికి ఇంతటి తెగింపు ఎక్కడిది.. వీరి వెనుక ఎవరున్నారు.. డబ్బులు ఎవరిస్తున్నారు.. అనే అంశాలను పోలీసులు బయటపెట్టేందుకు సిద్ధంగా ఉన్నారు.

# పవన్ ట్రాప్‌లో జగన్



**నెల్లూరు-సూర్య వాస్తవం:**
రాజకీయాలు ఇలానే ఉండాలని లేదు. ఒకే విధంగా ఉంటే వాటిని రాజకీయాలు అనరు. చాణక్య నీతి ఆధారంగా రాజకీయాలు సాగుతూ ఉంటాయి. రాజకీయం అంటేనే పరమపద సోపానం లాంటిది. నిచ్చెనలు.. పాములు.. ఇలా చాలా ఉంటాయి. ఇందులో తెలివిగా వ్యవహరించిన వారు మాత్రమే పరమపద సోపానంలో విజయం సాధించగలుగుతారు.గతంలో ఏపీ రాజకీయాలలో వైసీపీ అధినేత రకరకాల చక్రవ్యూహాలు రచించేవారు. ఆయన వెంట నాడు విజయసాయిరెడ్డి.. వంటి నాయకులు ఉండేవారు. వారు తమ బుర్రకు పదును పెట్టి ఆలోచనలు చేసేవారు. వాటిని జనంలోకి తీసుకెళ్లేవారు జగన్. తద్వారా నాడు టిడిపి ప్రభుత్వానికి.. జనసేన పార్టీకి ఇబ్బందికరమైన వాతావరణం కలిగించేవారు. జగన్ వేసిన ఉచ్చులలో ప్రధానంగా వారు చిక్కుకునేవారు. 2019 ఎన్నికల్లో జరిగింది అదే. అందువల్లే జగన్ ఏకపక్షంగా అధికారంలోకి రాగలిగారు.జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత.. టిడిపి తరఫున మహాసేన రాజేష్ సోషల్ మీడియాలో గట్టిగా మాట్లాడేవారు. నాడు మహాసేన రాజేష్ పవన్ కళ్యాణ్.. జగన్ ను విమర్శించేవారు. చంద్రబాబును ఒక్క మాట కూడా అనేవారు కాదు. ఇటీవలి ప్రశ్న రావణ్ కూడా ఏపీ సీఎం, ఐటీ మంత్రిని ఒక్క మాట అనలేదు. కేవలం పవన్ కళ్యాణ్ మీద మాత్రమే దాడి చేసేవారు. ఇష్టానుసారంగా మాట్లాడేవారు. జడ శ్రావణ్ కూడా జన సేన అధినేత ను టార్గెట్ చేసుకొని విమర్శించేవారు.. అయితే ఎన్నడూ కూడా ఏపీ సీఎం, ఆయన కుమారుడిని విమర్శించే వారు కాదు.రావణ్.. జడ శ్రావణ్ వ్యవహార శైలి రోజురోజుకు దారుణంగా మారుతున్న నేపథ్యంలో..పవన్ కళ్యాణ్ పై. తీవ్రస్థాయిలో విమర్శలు చేస్తున్న నేపథ్యంలో.. జనసేన నాయకులకు కడుపు రగిలిపోయింది. పవన్ కళ్యాణ్ నుంచి ఆదేశాలు రావడంతో వారు కేసులు పెట్టడం మొదలుపెట్టారు. ఫలితంగా పోలీసులు కేసులు కట్టి రావణ్ మీద చర్యలు తీసుకోవడం మొదలుపెట్టారు. ఒకరకంగా పోలీసులకు అరెస్ట్ చేసే పరిస్థితి మాత్రమే కల్పించి.. తాను ఏంటో నిరూపించుకున్నారు పవన్. ఈ విషయంలో టిడిపికి కూడా పవన్ కళ్యాణ్ మాటకు ఊ కొట్టడం తప్ప మరో మార్గం లేకుండా పోయింది.పవన్ కళ్యాణ్ గట్టిగా నిలబడడంతో రావణ్ లాంటివాళ్ళు ఇప్పుడు నోరు మూసుకొని కూర్చున్నారు. వాస్తవానికి ఇక్కడ రావణ్ లేదా శ్రవణ్ వల్ల వైసీపీకి పెద్దగా ఉపయోగం లేదు. ఎందుకంటే వైసీపీకి దళిత క్రైస్తవులు ఓట్లు ఆల్రెడీ ఉన్నాయి. మొదటి ఎన్నికల్లో కొంత మాత్రమే తగ్గాయి. ఎస్సీ.. ఎస్టీలు కూడా జగన్మోహన్ రెడ్డికి అండగా ఉన్నారు. అలాంటప్పుడు శ్రావణ్ విషయంలో.. రావణ్ విషయంలో జగన్ ఎందుకు తొందర పడుతున్నారు.. ఎందుకు ఆయన వకాల్తా పుచ్చుకుంటున్నారో అర్థం కావడం లేదు. పవన్ కళ్యాణ్ వేసిన ట్రాప్ లో పడి జగన్ ఇబ్బంది పడుతున్నారు. ఇదే సమయంలో హిందువుల పట్ల జగన్మోహన్ రెడ్డిని విలన్ లాగా చిత్రీకరించే ప్రయత్నాన్ని పవన్ విజయవంతంగా పూర్తి చేశారు.

## ప్రెస్ క్లబ్ ఎన్నికలు నిర్వహించాలి....

**- సీనియర్ పాత్రికేయులు చెరుకూరి రామాంజినేయులు**
**- రెండో రోజు వినూత్న నిరసన.. దిష్టిబొమ్మకు ఆక్సిజన్, సెలైన్ ఏర్పాటు**



**అనంతపురం ప్రతినిధి – సూర్య వాస్తవం :**అనం తపురం ప్రెసక్లబ్ కు వెంటనే ఎన్నికలు నిర్వహించాలని సీనియర్ జర్నలిస్ట్ చెరుకూరి రామాం జినేయులు డిమా ండ్ చేశారు.రెండో రోజు దీక్షకు సీనియర్ పాత్రికేయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ పరిస్థితిని వివరిస్తూ దిష్టిబొమ్మకు ప్రెస్ క్లబ్ పేరుతో ఆక్సిజన్, సెలైన్ ఏర్పాటు చేసి వినూత్న నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రామాంజినేయులు సూర్య వాస్తవం దినపత్రిక తో మాట్లాడుతూ.....ఎన్నికలు నిర్వహించకపోవడంతో ప్రెస్ క్లబ్ అభివృద్ధి నిలిచిపోయిందని, అర్హులైన జర్నలిస్టులకు ప్రయోజనాలు అందడం లేదని అయన పేర్కొన్నారు. మంగళవారం కూడా రిలే దీక్ష కొనసాగుతుందని, ఎన్నికల నిర్వహణపై స్పష్టత ఇవ్వాలని దీక్ష లో పాల్గొన్న జర్నలిస్టులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు, బీసీ సంఘం నాయకులు, విద్యార్థి సంఘం నాయకులు తదితరులు మద్దతు తెలియజేసారు.

## పారిశుధ్య కార్మికుల సంక్షేమానికి పెద్దపీట

**- 120 మంది సిబ్బందికి కొబ్బరి నూనె, సబ్బులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ**
**- సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే స్పష్టం**



**నాయుడుపేట-సూర్య వాస్తవం:**పట్టణాలను పరిశుభ్రంగా, ఆరోగ్యవంతంగా ఉంచేందుకు అహర్నిశలు శ్రమిస్తున్న పారిశుధ్య కార్మికుల సంక్షేమమే ప్రభుత్వ ప్రాధాన్యత అని సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ పేర్కొన్నారు. సూళ్లూరుపేట మున్సిపాలిటీ పరిధిలో విధులు నిర్వహిస్తున్న 120 మంది పారిశుధ్య కార్మికులకు సోమవారం తన క్యాంపు కార్యాలయంలో కొబ్బరి నూనె, సబ్బులను పంపిణీ చేసి వారిని సత్కరించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, వర్షం, ఎండ, చలి అనే తేడా లేకుండా ప్రతిరోజూ తెల్లవారుజామునే విధుల్లోకి చేరి ప్రజలకు పరిశుభ్రమైన వాతావరణాన్ని అందించడంలో పారిశుధ్య కార్మికులు కీలక పాత్ర పోషిస్తున్నారని కొనియాడారు. వారి సేవలు సమాజానికి ఎంతో విలువైనవని, వారి కృషి వల్లే పట్టణ ప్రజలు ఆరోగ్యకరమైన వాతావరణంలో జీవించగలుగుతున్నారని తెలిపారు.పారిశుధ్య కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దశలవారీగా పరిష్కరిస్తోందని, వారి సంక్షేమం కోసం మరిన్ని చర్యలు చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే వెల్లడించారు. భవిష్యత్తులో కూడా కార్మికుల సంక్షేమం కోసం ఇలాంటి కార్యక్రమాలు కొనసాగుతాయని తెలిపారు. తెలుగుదేశం పార్టీ జిల్లా అధికార ప్రతినిధి సుధాకర్ రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుతోట రమేష్, సూళ్లూరుపేట మున్సిపల్ కమిషనర్, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, మున్సిపల్ అధికారులు, పారిశుధ్య కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# సమాచార హక్కు చట్టం అమలులో
# నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

- శ్రీ సత్యసాయి జిల్లాలో రాష్ట్ర సమాచార కమిషనర్ సుడిగాలి పర్యటన
- హిందూపురం, పుట్టపర్తి, ధర్మవరంలో ఆకస్మిక తనిఖీలు
- నిబంధనలు ఉల్లంఘించిన పలువురు పిఐఓలకు షోకాజ్ నోటీసులు జారీ
-15 రోజుల్లోగా వివరణ ఇవ్వాలని ఆదేశం
- రాష్ట్ర సమాచార కమిషనర్ జి. ఆదెన్న



**శ్రీ సత్య సాయి బ్యూరో – సూర్య వాస్తవం:** ప్రజాస్వామ్యంలో పారదర్శకత, జవాబుదారీతనాన్ని పెంపొందించేందుకు సమా చార హక్కు చట్టం ఒక కీలక సాధనమని, దీని అమలులో ఎలాంటి నిర్లక్ష్యం వహించినా చట్టపరమైన చర్యలు తప్పవని రాష్ట్ర సమాచార కమిషనర్ జి. ఆదెన్న హెచ్చరించారు. సోమ వారం ఆయన శ్రీ సత్యసాయి జిల్లాలోని పలు ప్రభుత్వ కార్యాలయాల్లో క్షేత్రస్థాయిలో విస్తృతంగా ఆకస్మిక సుడిగాలి పర్యటనలు నిర్వహించి, ఆర్టీఐ దరఖాస్తుల స్వీకరణ, సకాలంలో వాటి పరిష్కారం మరియు పెండింగ్ వివరాలను తనిఖీ చేశారు. తన పర్యటనలో భాగంగా కమిషనర్ తొలుత హిందూపురం నగరంలోని మున్సిపల్ కార్యాలయం, ఎంజీఎం ఉన్నత పాఠశాల, ఉప రిజిస్ట్రార్ కార్యాలయాలను సందర్శిం చారు. అనంతరం పుట్టపర్తిలోని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం, ఐసిడిఎస్ కార్యాలయం, డ్వామా కార్యాలయం, ట్రెజరీ కార్యాలయాలతో పాటు పెడబల్లి, ధర్మవరం తదితర ప్రాంతాల్లోని ప్రభుత్వ కార్యాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆర్టీఐ చట్టంలోని సెక్షన్లు 18(3), 18(4), మరియు 19(8)(ఎ) కింద ఈ తనిఖీలు చేపట్టినట్లు ఆయన తెలిపారు. సమాచార హక్కు చట్టం-2005 లోని సెక్షన్ 4(1)(ఎ) ప్రకారం ప్రతి ప్రభుత్వ కార్యాలయం పాటించాల్సిన శాసన బద్ధమైన బాధ్యతలను నిర్వర్తించడంలో ప్రాథమికంగా వైఫల్యం చెందారు. కార్యాలయాల్లో ప్రజలకు స్పష్టతనిచ్చే 'సిటిజన్ చార్టర్' (పౌర చార్టర్)బోర్డులను ప్రదర్శించలేదు.. దరఖాస్తుదా రులకు అవసరమైన ప్రజా సమాచార అధికారి మొదటి అప్పిలేట్ అధికారి పేర్లు, వారి సంప్రదింపు వివరాలతో కూడిన డిస్ప్లే బోర్డులను ఏర్పాటు చేయలేదని పలువురు పిఐఓలకు ఆర్టీఐ చట్టంపై కనీస అవగాహన లోపించినట్లు కమిషనర్ అసంతృప్తి వ్యక్తం చేశారు.

**పలువురు అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ..**

శాసనబద్ధమైన బాధ్యతల నిర్వహణలో విఫలమైనందుకు గాను సమాచార హక్కు చట్టం సెక్షన్ 19(8)(ఎ) కింద కమిషనర్ ఆయా కార్యాలయాల ప్రజా సమాచార అధికారులకు ఘాటుగా షోకాజ్ నోటీసులు జారీ చేశారు.

**నోటీసులు అందుకున్న కార్యాలయాల వివరాలు..**

హిందూపురం మున్సిపల్ కార్యాలయం, హిందూపురం ఎంజీఎం ఉన్నత పాఠశాల, హిందూపురం ఉప రిజిస్ట్రార్ కార్యాలయం, పెడబల్లి ఉన్నత పాఠశాల, పుట్టపర్తి డిఎండ్ హెచ్ఓ కార్యాలయం, పుట్టపర్తి ఐసిడిఎస్ కార్యాలయం, పుట్టపర్తి డ్వామా కార్యాలయం, పుట్టపర్తి ట్రెజరీ కార్యాల యం, ధర్మవరం మున్సిపల్ కార్యాలయాలు ఉన్నట్లు కమి షనర్ తెలిపారు. ఈ షోకాజ్ నోటీసులు అందిన 15 రోజుల లోపు సంబంధిత అధికారులు కమిషన్‌కు సంతృప్తి కరమైన వివరణ సమర్పించాలని రాష్ట్ర సమాచార కమిషనర్ స్పష్టం చేశారు. నిర్ణీత గడువులోగా వివరణ ఇవ్వడంలో విఫలమైతే, తదుపరి ఎటువంటి నోటీసులు ఇవ్వకుండానే అందు బాటులో ఉన్న రికార్డుల ఆధారంగా కఠినమైన చర్యలు తీసు కుంటామని హెచ్చరించారు. ప్రథమ అప్పీల్ అధికారులు, ప్రజా సమాచార అధికారులు సహాయ ప్రజా సమాచార అధికారులు చట్టం లోని నిబంధనలపై, దరఖా స్తుల పరి ష్కారంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కమిషన్ ఆదేశాలను తప్పనిసరిగా అమలు చేస్తూ ప్రజలకు సత్వర, పారదర్శక సేవలు అందించాలని ఆదేశించారు. ఈ ఆకస్మిక తనిఖీ కార్యక్రమాల్లో మున్సిపల్ కమిషనర్లు, వివిధ ప్రభుత్వ శాఖల జిల్లా, మండల స్థాయి అధికారులు, సచివాలయ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

# బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలి

- జిల్లా ఎస్పీ పి.జగదీష్
- గ్రామ మహిళా పోలీసులకు నియామక ఉత్తర్వులు అందజేసిన జిల్లా ఎస్పీ



**అనంతపురం క్రైమ్ – సూర్య వాస్తవం :** ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా క్రీడా కోటా (స్పోర్ట్స్ కోటా) కింద ఎంపికైన 18 మంది గ్రామ మహిళా సంరక్షకులకు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాల యంలో నియామక, పోస్టింగ్ ఉత్తర్వులను జిల్లా ఎస్పీ పి.జగదీష్ ఐపీఎస్ అందజేశారు. 2019 నోటిఫికేషన్‌కు చెందిన ఈ అభ్యర్థుల నియామక ప్రక్రియపై గౌరవ న్యాయస్థానం ఇచ్చిన ఆదేశాల మేరకు ప్రభుత్వం నిర్దేశించిన నియమ నిబంధనలను కచ్చితంగా పాటిస్తూ ఈ నూతన అపాయింట్‌మెంట్ ఆర్డర్స్ కమ్ పోస్టింగ్ ఆర్డర్లను జారీ చేసినట్లు ఎస్పీ వివరించారు. ఈ సందర్భంగా ఎస్పీ జగదీష్ నూతనంగా విధుల్లోకి చేరుతున్న మహిళా పోలీసులతో మాట్లాడారు. క్రీడా స్ఫూర్తితో విధుల్లోనూ రాణించాలని, గ్రామాల్లో మహిళలు, బాలల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. క్షేత్రస్థాయిలో ప్రజలకు, పోలీసు శాఖకు మధ్య వారధిలా పనిచేస్తూ.. బాధితులకు తక్షణ న్యాయం జరిగేలా చూడటంలో కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. చట్టాలపై అవగాహన పెంచుకుని, అంకితభావంతో పనిచేసి శాఖకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు ఎం.నాగభూషణం, ఎస్ మహబూబ్ బాషా, జిల్లా పోలీస్ కార్యాలయ పరిపాలనాధికారి రవిరాం నాయక్ , సీనియర్ అసిస్టెంట్ నందకుమార్ , తదితరులు పాల్గొన్నారు.



# ఓటర్ల జాబితా సవరణకు నేడే ఆఖరి రోజు!

**ఉరవకొండ – సూర్య వాస్తవం:** ఉరవకొండ నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర్ రెడ్డి రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న ఎస్ ఐఆర్ సర్వే, సమగ్ర ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ నేటితో ముగుస్తుండడంతో అర్హులైన ప్రతి ఒక్కరూ తక్షణమే స్పందిం చాలని వైఎస్సార్సీపీ ఉరవకొండ నియోజకవర్గ ఇంచార్జి వై. విశ్వేశ్వరరెడ్డి సూర్య వాస్తవం ద్వారా పిలుపునిచ్చారు. ఓటు అనేది ప్రతి ఒక్కరి హక్కు, బాధ్యత అని గుర్తు చేస్తూ, జాబితా లో పేరు కొనసాగాలంటే నేడే చివరి అవకాశం అని ఆయన స్పష్టం చేశారు. నియోజకవర్గంలోని వైస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు ఈ విషయాన్ని గమనించి తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

**నేడే ఆఖరి గడువు:** ఓటర్ల నమోదు మరియు సవరణలకు ఈరోజు (14వ తేదీ) చివరి రోజు.

**చేయవలసిన పని:** అర్హత ఉండి, ఇంకా నమోదు చేసుకోని వారు తక్షణమే ఎన్యూమరేషన్ ఫారంతో పాటు తమ పాస్ ఫోటో, ఆధార్ కార్డు జిరాక్స్ ప్రతులను సిద్ధం చేసుకోవాలి. మీ పరిధిలోని స్థానిక సచివాలయంలో గల బీఎల్ఓ లను కలిసి ఈ పత్రాలను వెంటనే అందజేయాలి.

**ముఖ్య హెచ్చరిక:** నేడు ఈ ప్రక్రియ పూర్తి చేయని యెడల, 21వ తేదీన విడుదల కాబోయే ఓటర్ల ముసాయిదా జాబితాలో మీ ఓటు గల్లంతయ్యే (తొలగిపోయే) ప్రమాదం ఉందని విశ్వేశ్వరరెడ్డి హెచ్చరించారు. సమయం చాలా తక్కువగా ఉన్నందున ప్రతి ఒక్కరూ అలసత్వం వీడి, తమ ఓటు హక్కును భద్రపరుచుకోవాలని కోరడమైనది.



# కొడుకును హత్య చేసిన తల్లి...!

- మద్యం తాగొచ్చి వేధిస్తున్నాడని దారుణం

**అనంతపురం క్రైమ్ – సూర్య వాస్తవం :** అనంతపురంలో తన కుమారుడిని తల్లి హత్య చేసిన ఘటన ఇటీవల వెలుగులోకి వచ్చింది. మద్యానికి బానిసై, రోజూ ఇంటికి వచ్చి వేధింపులకు పాల్పడుతున్నాడనే కోపంతో కన్న కొడుకును తల్లి దారుణంగా హతమార్చింది... అసలు వివరాల్లోకి వెళితే....అనంతపురం టౌన్ లోని మొదటి రోడ్డుకు చెందిన బోనాల సురేంద్ర అనే 28 ఏళ్ల యువకుడు మద్యానికి బానిసగా మారిపోయాడు. ప్రతి రోజూ మద్యం తాగి వచ్చి.. ఇంట్లో గొడవపడేవాడు. తల్లిదండ్రులను వేధించేవాడు. ఈ క్రమంలోనే సోమవారం రోజు సాయంత్రం కూడా ఫుల్లుగా మద్యం తాగి వచ్చాడు సురేంద్ర. మద్యం మత్తులో తల్లి సునీతమ్మతో గొడవపడ్డాడు. తల్లిపై దాడికి యత్నించాడు. దీంతో కోపంలో సునీతమ్మ కత్తెరతో సురేంద్రపై దాడి చేసింది. క్షణికావేశంలో సురేంద్ర గొంతుపై కత్తెరతో పొడవటంతో సురేంద్ర ప్రాణాలు కోల్పోయాడు. అనంతరం సునీతమ్మ నేరుగా పోలీస్ స్టేషన్‌కు వెళ్లి పోలీసుల ఎదుట లొంగిపోయింది.

# జెడ్పీలో ఇద్దరికి ఏఓలుగా ఉద్యోగోన్నతి



**అనంతపురం – సూర్య వాస్తవం :** జిల్లా ప్రజా పరిషత్ యాజ మాన్యం కింద పని చేస్తున్న ఇద్దరు సీనియర్ సహాయకులకు ఏఓలుగా ఉద్యోగోన్నతి కల్పించారు. వారిలో జెడ్పీ ఏ సెక్షన్ లో పని చేసే కె.అరుణకుమారి, అనంతపురంలో పీఆర్ సబ్ డివిజన్ -2 లో డిప్యూటీషన్ పై కొనసాగుతున్న వీ.ఎన్.ఎస్. మాధవికి పరిపాలనాధికారులుగా ఉద్యోగోన్నతి కల్పించారు. ఈ మేరకు వారికి ఉద్యోగోన్నతి కల్పించి, పోస్టింగ్స్ కేటాయించారు. ఈ మేరకు ఉత్తర్వులను ఉమ్మడి జిల్లా ప్రజా పరిషత్ చైర్ పర్సన్ బోయ గిరిజమ్మ, సీఈఓ విజయలక్ష్మి సోమవారం అందజేశారు. వారినుద్దేశించి చైర్ పర్సన్ గిరిజమ్మ మాట్లాడుతూ.. ఉద్యోగోన్నతి పొందిన వారికి తొలుత శుభాకాంక్షలు తెలిపారు. ఉద్యోగులు మరింత భాద్యతగా పని చేయాలని కోరారు. ప్రజలకు మంచి సేవలు అందిస్తూ, వ్యవస్థకు మంచి పేరు తీసుకురావాలని దిశానిర్దేశం చేశారు.

# అనంతపురం డీ.ఎం.హెచ్.ఓ
# డాక్టర్ ఈబీ దేవి కడపకు బదిలీ

- అనంత నూతన డీఎంహెచ్‌ఓగా డాక్టర్ కట్టా వెంకటేశ్వర్లు
- అనంతపురం సర్వజనాస్పత్రి సీ.ఎస్.ఆర్ఎంఓగా డాక్టర్ శ్రీనివాసరెడ్డి



**అనంతపురం – సూర్య వాస్తవం :** అనంతపురం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి (డీఎంహెచ్) డాక్టర్ ఈబీ దేవి బదిలీ అయ్యారు. ఈమెను కడపలోని 300 పడకల సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి సీఎస్ ఆర్ఎంఓగా బదిలీ చేస్తూ ప్రిన్సిపల్ సెక్రటరీ సురేష్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. అనంతపురం డీఎంహెచ్ ఐగా శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాలోని అల్లూర్ సీహెచ్సీలో వైద్యులుగా పని చేస్తున్న డాక్టర్ కట్టా వెంకటేశ్వర్లు నియమితులయ్యారు. అదేవిధంగా అనంతపురం ప్రభుత్వ సర్వజనాస్పత్రి సీఎస్ ఆర్ఎంఓగా తిరుపతి జిల్లా తడ ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో పని చేస్తున్న డాక్టర్ ఓ. శ్రీనివాసరెడ్డిని నియమించారు.

# జాతీయ స్థాయి తైక్వాండో పోటీలలో
# కృష్ణవేణి స్కూల్ విద్యార్థి ప్రతిభ



**పామిడి – సూర్య వాస్తవం:** తైక్వాండో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఇండియన్ ఒలంపిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తమిళనాడు రాష్ట్రం సేలం నందు గల మహాత్మగాంధీ ఇండోర్ స్టేడియంలో జూన్ 26 నుండి 28 వరకు జరిగిన 14వ నేషనల్ ఓపెన్ తైక్వాండో ఛాంపియన్షిప్‌లో అనంతపురం జిల్లా పామిడి కృష్ణవేణి ఇంగ్లీష్ మీడియం స్కూల్ నందు 4 వ తరగతి చదువుతున్న తలారి సత్యబ్రూస్లీ సబ్ జూనియర్ బాయ్స్ అండర్-16కేజీ విభాగంలో బంగారు పతకం సాధించాడు. ఈ సందర్భం గా పాఠశాల కరస్పాండెంట్ ఆర్. అనురాధ రెడ్డి ఇంచార్జ్ శశికళ సత్యబ్రూస్లీ ని అభినందించారు. పాఠశాల కరస్పాండెంట్ ఆర్ అనురాధ రెడ్డి మాట్లాడుతూ పామిడి మండలంలోనే తమ స్కూల్ నందు తైక్వాండో శిక్షణతో పాటు యోగ, గేమ్స్ అండ్ స్పోర్ట్స్ లో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామన్నారు. పిల్లలకు విద్యతోపాటు క్రీడలు కూడా ముఖ్యమన్నారు. ఈ కార్యక్రమంలో కోచ్ తులసిరామ్, పిఈటీ మల్లికార్జున ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

# విద్యుత్ ప్రమాదాలకు బలవుతున్న యువ రైతులు

- ఉమ్మడి జిల్లాలో 20 నెలల్లో 240 మంది మృతి..
- ఆందోళన కలిగిస్తున్న గణాంకాలు



**తాడిపత్రి– సూర్య వాస్తవం:** గత కొన్ని రోజుల క్రితం మండ లంలోని వెలమకూరు గ్రామానికి చెందిన రైతు మురళీ మోహన్‌రెడ్డి విద్యుదాఘాతానికి గురై మృతి చెందడం స్థానికం గా తీవ్ర విషాదాన్ని నింపింది. ఈ ఘటన ఉమ్మడి జిల్లాలో రైతులు ఎదుర్కొంటున్న విద్యుత్ ప్రమాదాల తీవ్రతను మరోసారి వెలుగులోకి తీసుకొచ్చింది. గత 20 నెలల్లో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సుమారు 240 మంది రైతులు విద్యుత్ షాక్‌కు గురై ప్రాణాలు కోల్పోయినట్లు సమాచారం. ఈ గణాం కాలు రైతాంగంలో తీవ్ర ఆందోళనకు కారణమవుతున్నాయి.

**ప్రమాదాలకు ప్రధాన కారణాలు**

విద్యుత్ వ్యవస్థపై సరైన అవగాహన లేకుండా రైతులు ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద స్వయంగా ఫ్యూజులు వేయడం, మం మ్మతులు చేయడానికి ప్రయత్నించడం. విద్యుత్ సమస్యలపై ఫిర్యాదులు చేసినప్పటికీ శాఖ అధికారులు, సిబ్బంది సకాలంలో స్పందించకపోవడం. ప్రమాదాల అనంతరం బాధ్యతను తప్పించుకునే ప్రయత్నాల వల్ల బాధిత కుటుంబాలకు పరిహారం అందడంలో జాప్యం ఏర్పడడం.

**అవగాహన కోసం ప్రత్యేక చర్యలు**

విద్యుత్ శాఖ, ఆర్డీటీ సంస్థ సంయుక్తంగా రూ.17 లక్షల వ్యయంతో "విద్యుత్తు రక్షక్" అవగాహన వాహనాన్ని ఏర్పాటు చేశాయి. ఈ వాహనం ద్వారా గ్రామాల్లో లఘు చిత్రాల ద్వారా విద్యుత్ భద్రతపై రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. అలాగే అత్యవసర సేవలు, ఫిర్యాదుల కోసం 1912 టోల్‌ఫ్రీ నంబర్‌ను అందుబాటులో ఉంచారు.


**రైతులు తప్పనిసరిగా పాటించాల్సిన జాగ్రత్తలు**

స్టార్టర్ బాక్స్ ఆన్ చేసే సమయంలో చేతులు తడిగా ఉండకూడదు. రబ్బరు చెప్పులు లేదా రబ్బరు బూట్లు ధరించి మాత్రమే విద్యుత్ పరికరాలను ఉపయోగించాలి. తెగిపోయిన విద్యుత్ వైర్లు లేదా ట్రాన్స్‌ఫార్మర్ల లోపాలను స్వయంగా సరిచేయడానికి ప్రయత్నించకూడదు. ఎలాంటి విద్యుత్ సమస్య వచ్చినా వెంటనే 1912కు సమాచారం ఇచ్చి, లైన్‌మెన్ వచ్చే వరకు వేచి ఉండాలి. విద్యుత్ శాఖ అధికారులు సకా లంలో స్పందించడం, రైతులు భద్రతా నిబంధనలను కచ్చి తంగా పాటించడం ద్వారా మాత్రమే ఇలాంటి ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చు. ప్రమాదాల్లో మృతి చెందిన రైతుల కుటుంబాలకు ప్రభుత్వం తక్షణ పరిహారం అందించి, విద్యుత్ భద్రతపై విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

# డీసీహెచ్ఎస్ కార్యాలయంలో ఎటువంటి అవకతవకలు జరగలేదు..!

- నియామకాలకు సంబంధించిన రికార్డులను పరిశీలించిన జిల్లా స్థాయి అధికారులు
- సూర్య వాస్తవం దినపత్రిక కథనానికి స్పందన

**అనంతపురం – సూర్య వాస్తవం :** సూర్య వాస్తవం దిన పత్రికలో జూలై 7వ తేదీ "డీసీహెచ్ఎస్ కార్యాలయ వ్యవహారాలపై ప్రక్షాళన జరుగుతుందా?" అనే శీర్షికతో ప్రచురితమైన వార్తా కథనంపై జిల్లా స్థాయి అధికారులు సమగ్ర విచారణ నిర్వహించారు. ఇందులో భాగంగా నియామకాలకు సంబంధించిన నోటిఫికేషన్ నెం.02/2023, తేదీ: 13,10,2023, నోటిఫికేషన్ నెం.01/2025, తేదీ: 19.05.2025, రిజర్వేషన్ రోస్టర్ రిజిస్టర్లు, ఎంపిక ప్రక్రియకు సంబంధించిన దస్త్రాలు, జిల్లా స్థాయి కమిటీ ఏర్పాటు ఉత్తర్వులు, ఇతర సంబంధిత రికార్డులను సమగ్రంగా పరిశీలించడం జరిగిందని తెలిపారు. వారి పరిశీలనలో, నియామక ప్రక్రియ ప్రభుత్వం జారీ చేసిన నిబంధనలు, ఉత్తర్వులు మరియు రిజర్వేషన్ రోస్టర్ మార్గదర్శకాలకు అనుగుణంగా పారదర్శకంగా నిర్వహించబడినట్లు నిర్ధారణ అయింది. అలాగే, అధికారుల ఆమోదంతో నియామక ప్రక్రియ చేపట్టబడినదని, రూల్ ఆఫ్ రిజర్వేషన్ అమలును పర్యవేక్షించేందుకు జిల్లా స్థాయి కమిటీ ఏర్పాటు చేసి, దాని పర్యవేక్షణలో నియామకాలు నిర్వహించినట్లు గుర్తించారని తెలియజేశారు. అందుబాటులో ఉన్న అన్ని రికార్డులు, పత్రాలను పరిశీలించిన అనంతరం, అప్పటి అనంతపురం జిల్లా జిల్లా కోఆర్డినేటర్ ఆఫ్ హాస్పిటల్ సర్వీసెస్ (డీసీహెచ్ఎస్) కార్యాలయం ద్వారా చేపట్టిన నియామక ప్రక్రియలో ఎటువంటి అక్రమాలు, నిబంధనల ఉల్లంఘనలు లేదా అవకతవకలు జరగలేదని విచారణలో తేలింది. వాస్తవ పరిస్థితులను ప్రజలకు తెలియజేయుటకై ఈ సమాచారం ప్రచురణార్థం పంపించడమైనది జిల్లా కలెక్టర్ కార్యాలయం వారు తెలియజేశారు.



కలెక్టర్ వారి కార్యాలయం, అనంతపురము.
తేది: 13.07.2026.

రిజాయిండర్

సూర్య వాస్తవం దినపత్రికలో 09.07.2026న "డీసీహెచ్ఎస్ కార్యాలయ వ్యవహారాలపై ప్రక్షాళన జరుగుతుందా?" అని శీర్షికతో ప్రచురితమైన వార్తా కథనంపై సమగ్ర విచారణ నిర్వహించడమ్ జరిగింది.

విచారణ సందర్భంగా నియామకాలకు సంబంధించిన నోటిఫికేషన్ నెం.02/2023, తేది:13.10.2023 మరియు నోటిఫికేషన్ నెం.01/2025, తేది:19.05.2025, రిజర్వేషన్ రోస్టర్ రిజిస్టర్లు, ఎంపిక ప్రక్రియకు సంబంధించిన దస్త్రాలు, జిల్లా స్థాయి కమిటీ ఏర్పాటు ఉత్తర్వులు మరియు ఇతర సంబంధిత రికార్డులను సమగ్రంగా పరిశీలించడం జరిగింది.

పరిశీలనలో, నియామక ప్రక్రియ ప్రభుత్వం జారీ చేసిన నిబంధనలు, ఉత్తర్వులు మరియు రిజర్వేషన్ రోస్టర్ మార్గదర్శకాలకు అనుగుణంగా పారదర్శకంగా నిర్వహించబడినట్లు నిర్ధారణ అయింది. అలాగే, అధికారుల ఆమోదంతో నియామక ప్రక్రియ చేపట్టబడినదని, రూల్ ఆఫ్ రిజర్వేషన్ అమలును పర్యవేక్షించేందుకు జిల్లా స్థాయి కమిటీ ఏర్పాటు చేసి, దాని పర్యవేక్షణలో నియామకాలు నిర్వహించినట్లు గుర్తించబడింది.

అందుబాటులో ఉన్న అన్ని రికార్డులు, పత్రాలను పరిశీలించిన అనంతరం, అప్పటి అనంతపురం జిల్లా జిల్లా కోఆర్డినేటర్ ఆఫ్ హాస్పిటల్ సర్వీసెస్ (డీసీహెచ్ఎస్) కార్యాలయం ద్వారా చేపట్టిన నియామక ప్రక్రియలో ఎటువంటి అక్రమాలు, నిబంధనల ఉల్లంఘనలు లేదా అవకతవకలు జరగలేదని విచారణలో తేలింది.

వాస్తవ పరిస్థితులను ప్రజలకు తెలియజేయుటకై ఈ సమాచారం ప్రచురణార్థం పంపించడమైనది.

కలెక్టరు వారి తరపున,
(జిల్లా రెవెన్యూ అధికారి)

# నూతన ప్రభుత్వ భవనాలను ప్రారంభించిన ఎమ్మెల్యే జెసి అష్మిత్ రెడ్డి



**తాడిపత్రి – సూర్య వాస్తవం :** నియోజకవర్గ పరిధిలోని పెద్ద పప్పూరు మండలం చిన్న యక్కలూరు గ్రామంలో సోమ వారం స్థానిక శాసనసభ్యులు జెసి అష్మిత్ రెడ్డి విస్తృతంగా పర్యటించారు. గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ కార్యాలయ భవనాన్ని, అలాగే విలేజ్ క్లినిక్‌ను ఆయన రిబ్బన్ కట్ చేసి అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి, ప్రజలకు మౌలిక వసతుల కల్పనకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉంద న్నారు. నూతనంగా అందుబాటులోకి వచ్చిన పంచాయతీ కార్యాలయం ద్వారా ప్రజలకు పాలనా సేవలు మరింత సులభతరం అవుతాయని, విలేజ్ క్లినిక్ ద్వారా గ్రామస్థులకు చెంతనే ప్రాథమిక వైద్య సేవలు అందుతాయని ఆయన పేర్కొన్నారు.

**ప్రజలతో ముఖాముఖి**

కార్యక్రమం అనంతరం ఎమ్మెల్యే జెసి అష్మిత్ రెడ్డి గ్రామంలో పర్యటించి స్థానికులతో మమేకమయ్యారు. గ్రామ ప్రజల యోగక్షేమాలను, వారు ఎదుర్కొంటున్న స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తాగునీరు, రహదారులు, వీధి దీపాల వంటి సమస్యలను గ్రామస్థులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, వాటిని త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా తాము నిరంతరం శ్రమిస్తామని ఈ సందర్భంగా ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# సర్ గడువు పెంచాలి

-బిఎస్పీ ఆధ్వర్యంలో తహశీల్దార్‌కు ఇచ్చిన వినతి



**గుత్తి – సూర్య వాస్తవం:** గుత్తి జాతీయ సమగ్ర ఓటర్ల సవర ణ (సర్) కార్యక్రమాన్ని ప్రభుత్వం పొడిగించాలని కోరుతూ బహుజన సమాజ్ పార్టీ బిఎస్పి ఆధ్వర్యంలో సోమవారం మండల తహశీల్దార్ పుణ్యవతికి ఆ పార్టీ నాయకులు విన తిపత్రం అందజేశారు. గతంలో ప్రభు త్వ ఉద్యోగులు, ఉపా ధ్యాయులతో ఓటర్ల సర్వే కార్యక్రమం నిర్వహించే వారన్నారు. ప్రస్తుతం ఈ కార్యక్రమం రాజకీయ పార్టీల ప్రతినిధుల సమ క్షంలో జరుగుతోంది కాబట్టి వారికి అనుకూలమైన ఓటర్ల పేర్లు మాత్రమే జాబితాలో ఉండే అవకాశం ఉం దన్నారు.ఈ కార్యక్రమంలో బీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షులు విజయ్, గుత్తి మండల కార్యదర్శి ఎన్ రామాంజనేయులు తదితరులు పాల్గొ న్నారు.

# మోడల్ స్కూల్ విద్యార్థులకు మత్తు పదార్థాలపై అవగాహన



**గుత్తి – సూర్య వాస్తవం:** గుత్తి అనంతపురం ఎస్పి జగదీశ్ ఐపీఎస్ సూచనల మేరకు గుంతకల్ ఎస్డీపీవో శ్రీనివాస్ ఆధ్వర్యంలో సోమవారం గుత్తి మోడల్ స్కూల్ నందు సీఐ రామారావు మరియు ఎస్ఐ అమిర్ ఖాన్ విద్యార్థులతో సమా వేశం ఏర్పాటు చేసి వారికీ డ్రగ్స్ (గం జాయి)వాడితే కలిగే దుష్ప్రభావా లు,మహిళలపై జరుగు నేరాలు,పి ల్లలపై జరుగు నేరాలు,పోక్సో(పిఓ సిఎస్ఓ)చట్టం,బాల్యవివాహాలు,సై బర్ మోసాలు,రోడ్డు భద్రత సూత్రా లు,స్త్రీరక్ష యాప్ మొద లగు వాటిపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిం చాము.అలాగే అప్రమత్తంగా ఉండా లని,అలాగే వారి కుటుంబ సభ్యుల కు కూడా పై విషయాలు తెలియజే సి,వారు కూడా అప్రమత్తంగా ఉండే టట్లు చూడాలి అని తెలియపరచ డం జరిగింది. అటువంటి సంఘటనలు ఏవైనాజరిగితే వాటి గురించి పోలీస్‌వారికీ తెలియజేయాలని సూచించామన్నారు.

# స్విమ్స్‌కు రూ.పది లక్షల విరాళం



**శ్రీ సత్య సాయి బ్యూరో – సూర్య వాస్తవం :** శ్రీ వెంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ (స్విమ్స్) ఆసుపత్రికి స్విమ్స్ శ్రీ బాలాజి ఆరోగ్య వరప్రసాదిని పథకానికి బెంగళూరు నగరానికి చెందిన మిథున్ .యం, వారి కుటుంబ సభ్యుల కోరిక మేరకు స్విమ్స్ హాస్పిటల్ పేద రోగులకు అందిస్తున్న వైద్య సేవలను పరిగణలోనికి తీసుకొని ఈ విరాళం అందించినట్టు దాతలు తెలిపారు. దాత తరపున తిరుపతికి చెందిన వై. రాఘవేంద్ర చేతుల మీదుగా పది లక్షల రూపాయల విరాళాన్ని డి.డి. రూపంలో సోమవారం స్విమ్స్ డైరెక్టర్ కార్యాలయంలో స్విమ్స్ సంచాలకులు, ఉపకులపతి డా॥ ఆర్.వి.కుమార్ కు అందజేశారు. స్విమ్స్ సంచాలకులు మరియు ఉపకులపతి డా॥ ఆర్.వి. కుమార్ విరాళ దాత మిథున్ కు మరియు వారి కుటుంబ సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేసి, ఇచ్చిన విరాళాన్ని పేద రోగుల వైద్య సేవలకు ఉపయోగిస్తామని తెలియజేశారు.



# యాదవ యువసేన సమావేశం

**కదిరి – సూర్య వాస్తవం:** పట్టణంలోని స్థానిక ఆర్ అండ్ బి అతిథి గృహం ప్రాంగణమునందు కదిరి యాదవ యువసేన తరుపున యాదవ సోదరులు సమావేశం కావడం జరిగింది. ఈ సమావేశంలో నచ్చు బాలకృష్ణ యాదవ్ మాట్లాడుతూ యాదవ యువత ఏవిధంగా బ్లడ్ డొనేషన్, మరియు విద్యార్థులకు విద్య పరంగా , యువత కు ఉద్యోగం విషయం లో ఆంధ్రప్రదేశ్, కర్ణాటక మరియు తెలంగాణ నందు ప్రయివేట్ కంపెనీ లలో అవకాశాలు విషయంలో ఏవిధంగా సహాయ సహకారాలు అందిస్తూ ముందుకు వెళ్లాలి అని యువత , సీనియర్ సభ్యులు మరియు ఉద్యోగ సంఘం తో కలిసి ముందుకు వెళ్లే విషయం గురించి మాట్లాడటం జరిగింది. హాజరైనా యాదవ సోదరులు వారి సమస్యలు తెలపడం జరిగింది. యాదవ యువసేన తరుపున వారి సమస్యల కృషి కి రాజకీయ పార్టీల కు అతీతంగా అందరం కలిసి సమస్యల పరిష్కారం కొరకు ముందుకు వెళ్లడం జరుగుతుంది అని అందరూ కలిసి ఏకగ్రీవంగా ఆమోదిస్తూ మాట్లాడటం జరిగింది. ఈ కార్యక్రమం లో యాదవ యువసేన సభ్యులు నచ్చు బాలకృష్ణ యాదవ్, కటారి రెడ్డి యాదవ్, నచ్చు రమేష్ యాదవ్, గంటేం నరేంద్ర యాదవ్, రాజేంద్ర యాదవ్ , లక్ష్మయ్య యాదవ్, పవన్ యాదవ్, శివ యాదవ్ ఉద్యోగ సంఘం నాయకులు శ్యాం ప్రసాద్ యాదవ్, సుధాకర్ యాదవ్ , సూరిదు యాదవ్, నరసింహులు యాదవ్, సుధీర్ యాదవ్, శేషు యాదవ్ , ఓబుళపతి యాదవ్, భరత్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు


# విద్యుత్ బిల్లు ఆన్లైన్లో చెల్లించాలి

- ఏఈ మధుసూదన్



**పామిడి– సూర్య వాస్తవం:** విద్యుత్ బిల్లుల చెల్లింపు లను ఇకమీదట పూర్తిగా డిజిటల్ విధానంలోకి తీసుకురావాలని మండల విద్యుత్ శాఖ అధికారి మధుసూదన్ రావు పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రస్తుతం ఈ విధానం 50శాతం బిల్లులు ఆన్లైన్లో చెల్లింపులు జరుగు తున్నాయని, ఈ ప్రక్రియను 100శాతానికి పెంచుతా మన్నారు. ఇకమీదట రెవిన్యూ విద్యుత్ శాఖ కార్యాల యంలో ఆన్లైన్ చెల్లింపులకే ప్రాధాన్యం ఇస్తామని నగదు వసూళ్ల కేంద్రాలను మూసివేయ నుందని ప్రభుత్వం ఆదేశాల ప్రకారం అధికారక యాప్, వెబ్సైట్ ద్వారానే బిల్లును చెల్లించాలని ఏఈ మధుసూదన రావు పేర్కొన్నారు.

# నేడే చివరి దినం మీ ఓటు - మీహక్కు- మీ బాధ్యత



**పామిడి – సూర్య వాస్తవం:** రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న సర్వేలో మీ పేరు ఓటర్ల జాబితాలో కొనసాగాలంటే నేడే గడువు దినం కావున మీ ఓటు మీ హక్కు మీ బాధ్యతను కాపాడుకోవాలని ఎడిసిసి బ్యాంక్ జిల్లా మాజీ చైర్మన్, వైఎస్ఆర్సిపి జిల్లా సీనియర్ నాయకులు పామిడి వీరాంజనేయులు సోమవారం పత్రిక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా రెండు పాస్ ఫోటోలు ఆధార్ కార్డు జిరాక్స్ మీ ప్రాంతపు బిఎల్ఓ లకు అందించాలని ఆయన తెలిపారు. సమగ్రమైన ఓటర్ల జాబితా సవరణ ఎస్ ఐ ఆర్ ప్రక్రియ నేడు 14వ తేదీ గడువు ముగుస్తుండడంతో గుంతకల్ నియోజకవర్గంలోని అర్హత కలిగిన ఓటర్లు ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా ఓటు నమోదు చేసుకోవలసిన అవసరం ఎంతైనా ఉందని, నమోదు చేసుకోనివారు తక్షణమే ఎన్యూమరేషన్ ఫారంతో మీ పరిధిలోని సచివాలయంలో గల బిఎల్ఓతో సంప్రదించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. లేకుంటే 21వ తేదీ విడుదల అయ్యే ఓటర్ల ముసాయిదా జాబితాలో మీ ఓటు గల్లంతయ్యే అవకాశం ఉందనీ తెలియజేశారు.

# ఎస్ఐఆర్ సర్వే, ఓటర్ల జాబితా సవరణకు నేడే చివరి రోజు

- జనసేన ఇంచార్జి గౌతమ్



**ఉరవకొండ – సూర్య వాస్తవం:** ఉరవకొండ నియోజకవర్గ జనసేన ఇంచార్జి గౌతమ్ కుమార్ మీడియాకు ఇచ్చిన ప్రక టనలో సమగ్ర ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ నేటితో ముగు స్తుండడంతో, అర్హులైన ప్రతి ఒక్కరూ తక్షణమే స్పందించి తమ ఓటు హక్కును భద్రపరుచు కోవాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఓటు అనేది ప్రజా స్వామ్యంలో ప్రతి ఒక్కరి ప్రాథమిక హక్కు, సామాజిక బాధ్యత అని గుర్తు చేశారు. ఓటరు జాబితాలో తమ పేరు సక్రమంగా కొనసాగాలన్నా, మార్పులు-చేర్పులు చేసుకోవాలన్నా నేడే ఆఖరి అవకాశమని ఆయన స్పష్టం చేశారు. నియోజక వర్గంలోని జనసేన నాయకులు, కార్యకర్తలు, జనసైనికులు మరియు వీరమహిళలు ప్రత్యేక చొరవ తీసుకుని, స్థానిక ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. పోలింగ్ కేంద్రాల పరిధిలో ఎవరైనా అర్హులు మిగిలిపోకుండా చూసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## విద్యుత్ తీగలు తగిలి బోరు మెకానిక్ దుర్మరణం

### - చెడిపోయిన మోటారు వెలికితీస్తుండగా విషాదం



**బ్రహ్మంగారిమఠం-సూర్య వాస్తవం :** మండల పరిధిలోని సోమిరెడ్డిపల్లె పంచాయతీ పరిధి మద్దిరెడ్డిపల్లె గ్రామంలో సోమవారం ఉదయం జరిగిన ప్రమాదంలో ఓ బోరు మెకానిక్ విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. స్థానికుల వివరాల ప్రకారం, మద్దిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన డి. రమణయ్య వృత్తిరీత్యా బోరు మెకానిక్‌గా పని చేస్తున్నాడు. బోరు ట్రాక్టర్ యజమాని నాగేశ్వర్‌రెడ్డి వద్ద పనిచేస్తూ రైతులకు సంబంధించిన కాలిపోయిన, మరమ్మతులు చేసిన విద్యుత్ మోటార్లను బిగించడం, బోరుల నుంచి మోటార్లను వెలికితీయడం వంటి పనులు నిర్వహించేవాడు. ఈ క్రమంలో గ్రామానికి చెందిన ఓ రైతు బోరులో మోటారు చెడిపోవడంతో దానిని పైకి తీసేందుకు సోమవారం తెల్లవారుజామున రమణయ్య వెళ్లాడు. మోటారును వెలికితీసే సమయంలో బోరు ట్రాక్టర్‌కు పైన ఉన్న హైటెన్షన్ విద్యుత్ తీగలు తగలడంతో విద్యుత్ ప్రవహించి రమణయ్య తీవ్రంగా గాయపడి ఘటనా స్థలంలోనే మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. రమణయ్య ఆకస్మిక మృతితో కుటుంబ సభ్యులు, బంధువులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

## రాయచోటి నూతన ట్రాఫిక్ సీఐగా చాంద్ బాషా



**అన్నమయ్య బ్యూరో - సూర్య వాస్తవం :** రాయచోటి నూతన ట్రాఫిక్ సీఐగా చాంద్ బాషా సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఉన్న సీఐ శేఖర్ జిల్లా సైబర్ క్రైమ్, సోషల్ మీడియా సీఐగా విధుల్లో చేరారు. ఈ సందర్భంగా మదనపల్లెలోని జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో నూతన బాధ్యతలు చేపట్టిన ఆయన ఎస్పీ ధీరజ్ కునుబిల్లీని మర్యాదపూర్వకంగా కలిశారు. రాయచోటిలో ట్రాఫిక్ పరిష్కారం కోసం కృషి చేయాలని ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ అంకితభావంతో పనిచేయాలని ఎస్పీ సూచించారు.

## మానవ సేవే మాధవ సేవ



**హైదరాబాద్ - సూర్య వాస్తవం :** మానవ సేవే మాధవ సేవగా విద్యార్థినీ విద్యార్థులే దేశ భవిష్యత్తుగా పేద, బడుగు, బలహీన, దళిత, మైనార్టీ వర్గాలతో పాటు సమసమాజాభివృద్ధి లక్ష్యంగా ప్రజా సేవే పరమావధిగా, అకుంఠిత దీక్షతో సేవలందిస్తున్న ప్రజా సేవా సమితి గౌరవ సలహాదారు సీనియర్ జర్నలిస్ట్ తిప్పరాజు రమేష్ బాబు, కార్యవర్గ సభ్యులు బండి రాజేష్ కుమార్ రెడ్డి, సాగి సత్య సీతా రామరాజు, సుభాష్, సీనియర్ పాత్రికేయుడు విజయ్ కుమార్ రెడ్డి, ఈశ్వర్ రావు, శివ శంకర రావు ఆధ్వర్యంలో సోమవారం మణికొండ ఎంప్లాయిస్ కాలనీలో ఉన్న మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థినీ విద్యార్థులకు నోట్ బుక్స్, పెన్సిళ్లు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రజా సమితికి సంఘ సేవకుడు మాదిరెడ్డి పెంటా రెడ్డి, బీజేపీ మణికొండ శాఖ అధ్యక్షుడు కంకణాల శివ రామరెడ్డి, సంఘ సంస్కర్త, ఆమ్ ఆద్మీ ఫోరమ్ చైర్మన్ మాసూద్ మొహమ్మద్, ఎమ్ ఆర్ పి ఎస్ నాయకుడు కుమ్మరి సత్యనారాయణ, షేక్ పెట్ మిత్ర బృందం సభ్యులు రేణికుంట భాస్కర్, సుధా రామకృష్ణ, సాయి, విష్ణు, విద్యావేత్తలు, మానవతావాదులు మహమ్మద్ ఇక్బాల్, షాకిర్ ఆలీ, మరియాల మల్లేష్ మనోహర్ రామారావు, వెంకట్ రెడ్డి, బబ్లూ హర్షా రెడ్డి , పాఠశాల ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.

# రాయలసీమలో శాశ్వత కరువు నివారణే లక్ష్యం

- ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు
- జిల్లాలో జలధార జలహారతి 100 రోజుల కార్యక్రమాలు పటిష్టంగా అమలు
- జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్





**అన్నమయ్య బ్యూరో - సూర్య వాస్తవం :** రాష్ట్రంలో పోలవరం ప్రాజెక్టు పనుల పురోగతితో పాటు రాష్ట్రవ్యాప్తంగా చేపట్టనున్న 36 ప్రాధాన్యతా ప్రాజెక్టుల అమలుపై సోమవారం పోలవరం ప్రాజెక్టు ప్రాంతం నుంచి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షకు అన్ని జిల్లాల కలెక్టర్లు, ఉన్నతాధికారులు వర్చువల్‌గా హాజరయ్యారు. మదనపల్లి కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొని... జిల్లాలో అమలు చేస్తున్న జలధార కార్యక్రమం పురోగతిని ముఖ్యమంత్రికి వివరించారు. జిల్లాలో జలధార జలహారతి 100 రోజుల కార్యక్రమాలు పటిష్టంగా అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ... జలధార కార్యక్రమం ద్వారా చెరువుల పునరుద్ధరణ, అనుసంధానం వల్ల భూగర్భ జలాల మట్టం పెరగడంతో పాటు సాగునీటి లభ్యత మెరుగుపడుతున్నదని తెలిపారు. విబిజీరామ్ జి తో ఈ కార్యక్రమాన్ని అనుసంధానించి నిరంతరం కొనసాగిస్తూ... వీలైనన్ని చెరువులను పరస్పరం అనుసంధానం చేయాలని ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా చేపట్టనున్న 36 ప్రాధాన్యతా ప్రాజెక్టులతో జలధార కార్యక్రమాన్ని సమన్వయం చేసి, జిల్లాలో ఉన్న చెరువుల అనుసంధానానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ముఖ్యంగా రాయలసీమలో శాశ్వత కరువు నివారణే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని మరింత విస్తృతంగా అమలు చేయాలని కలెక్టర్లు, శాఖల కార్యదర్శులకు దిశానిర్దేశం చేశారు. జలధార కార్యక్రమం ద్వారా 100 రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా 11,133 చెరువులు ఫీడర్ చానల్స్ తో భూగర్భ జలాలు పెరిగేలా పనులు చేసినట్లు అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. జలధార కార్యక్రమాన్ని వేగవంతంగా అమలు చేసేందుకు ప్రతి జిల్లాకు తక్షణమే రూ.2 కోట్ల చొప్పున నిధులు మంజూరు చేస్తున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించారు. ఈ నిధులతో పాటు జిల్లాల్లో అందుబాటులో ఉన్న వివిధ శాఖల నిధులను సమన్వయం చేసుకుని జలధార కార్యక్రమాన్ని సమర్థవంతంగా పూర్తిచేయాలని సూచించారు. ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయంతో చెరువుల పునరుద్ధరణ, ఫీడర్ ఛానళ్ల అభివృద్ధి, నీటి నిల్వ సామర్థ్య పెంపు వంటి పనులను వేగవంతంగా చేపట్టి జలధార కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డ్వామా పిడి వెంకటరత్నం, ఇరిగేషన్ శాఖ రిటైర్డ్ ఎస్ఇ వెంకటరామయ్య, జిల్లా భూగర్భ జల శాఖ ఈఈ సువర్ణ కుమార్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# సర్' ప్రక్రియను వేగవంతం చేసి 100 శాతం పూర్తి చేయాలి

- కేంద్ర ఎన్నికల సంఘం కార్యదర్శి నవీన్ కుమార్
- జిల్లాలో తప్పులు లేని పటిష్టమైన ఓటర్ జాబితా రూపకల్పనకు కృషి చేస్తున్నాం
- జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్



**అన్నమయ్య బ్యూరో - సూర్య వాస్తవం :** సోమవారం జిల్లా కేంద్రం మదనపల్లికి విచ్చేసిన కేంద్ర ఎన్నికల సంఘం కార్యదర్శి నవీన్ కుమార్ కలెక్టరేట్‌లో... జిల్లాలో ప్రత్యేక ఓటరు జాబితా సవరన ప్రక్రియ పురోగతి, ఎన్నికల సన్నాహాలు, ఓటరు జాబితా నవీకరణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్, జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ శర్మ, సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణి, జిల్లా రెవెన్యూ అధికారి చంద్రశేఖర్ రెడ్డి, తంబళ్లపల్లి ఈఆర్వో మాధవ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్... జిల్లాలో సర్ ప్రక్రియ పురోగతిని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిరంతరం సమావేశాలు నిర్వహిస్తూ, ఈఆర్వోలు, ఏఆర్వోలు, బీఎల్ఓలతో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటనలు చేపట్టి ఓటర్లకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. బీఎల్ఓల సహకారంతో జిల్లాలో సర్ ప్రక్రియ వేగంగా కొనసాగుతోందని వివరించారు. జిల్లాలో మొత్తం 12,32,436 ఎన్యూమరేషన్ ఫారాలు పంపిణీ చేయగా, వాటిలో 12,05,362 ఫారాలు డిజిటలైజ్ చేసి 97.80 శాతం పురోగతి సాధించినట్లు కలెక్టర్ తెలిపారు. మిగిలిన ప్రక్రియను నిర్ణీత గడువులో పూర్తి చేయడానికి చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. అనంతరం కేంద్ర ఎన్నికల సంఘం కార్యదర్శి నవీన్ కుమార్ మాట్లాడుతూ, మిగిలిన ఫారాలలీ డిజిటలైజేషన్‌పై ప్రత్యేక దృష్టి సారించి, ప్రతి పోలింగ్ లీకేంద్రంలో ఎస్ ఐ అర్ ప్రక్రియను 100 శాతం పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. బీఎల్ఏలు, బీఎల్ఓలతో మంగళవారం ప్రత్యేక సమా వేశాలు నిలీర్వహించి, డబుల్ ఎంట్రీలు తదితర జాబితాలను అందజేసి, వాటిని క్షేత్ర స్థాయిలో ధృవీకరించి పెండింగ్ అంశాలను పూర్తి చేయాలని సూచించారు. ఓటరు జాబితా పూర్తిస్థాయిలో పారదర్శకంగా, ఖచ్చి తత్వంతో రూపొందించేందుకు ఎన్నికల సంఘం మార్గ దర్శకాల మేరకు అన్ని చర్యలు చేపట్టాలని సమావేశంలో అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో కేంద్ర ఎన్నికల సంఘం ఎస్ఓ అనితా కుర్కేజ, ఏఎస్ఓ ఉదిత్ కుమార్, కలెక్టరేట్ ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ పీర్ మున్నీ, సిబ్బంది పాల్గొన్నారు.

# పిజిఆర్‌ఎస్ సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం చూపరాదు

### - అర్జీదారుడు సంతృప్తి చెందేలా నాణ్యతగా సమస్యలను పరిష్కరించాలి - జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్





**అన్నమయ్య బ్యూరో - సూర్య వాస్తవం :** పిజిఆర్‌ఎస్ సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం చూపరాదు. అర్జీదారుడు సంతృప్తి చెందేలా నాణ్యతగా సమస్యలను పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ అధికారులను ఆదే శించారు. సోమవారం కలెక్టరేట్లోని పిజిఆర్‌ఎస్ హాలులో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్‌ఎస్) కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో కలెక్టర్ తో పాటు జేసీ శివ్ నారాయణ శర్మ, సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణి, డిఆర్ఓ చంద్రశేఖర్ రెడ్డి, ఎస్డిసి మాధవ కృష్ణారెడ్డి ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భం గా కలెక్టర్ మాట్లాడుతూ.... పిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు .. క్షేత్ర స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేయాలన్నారు. అర్జీ దారుడు సంతృప్తిచెందేలా నిర్ణీత గడువులోపు అర్జీలను తప్పనిసరిగా పరిష్కరించాలన్నారు. పెండింగ్ దరఖా స్తులు, బియాండ్ ఎస్ఎల్ఏ, రీఓపెనింగ్.. లేకుండా అర్జీ దారుడు సంతృప్తి చెందేలా అర్జీలను పరిష్కరించాలన్నారు. అనంతరం అర్జీదారులనుండి వారు అర్జీలను స్వీకరించారు.

**ప్రజల నుండి అందిన విజ్ఞప్తులలో కొన్ని..**

మదనపల్లి మండలం పెంచుపాడు గ్రామం కట్టుబావి హాబిటేషన్ కు చెందిన ఎర్రమంచి గంగులప్ప.. దివ్యాంగురాలైన తన కూతురికి పింఛన్ మంజూరు చేసి ఆదుకోవాలని అర్జీ సమర్పించారు. పెద్దమండెం మండలం పంచాయితీకి చెందిన కే.రెడ్డిప్యారి... తన భర్త 2025 డిసెంబర్లో మృతి చెందారని, కూలి పని చేసుకునే తనకు ఎలాంటి జీవనాధారం లేకుండా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నానని, వితంతు పెన్షన్ మంజూరు చేయవలసిందిగా అర్జీ సమర్పించారు. సదుం మండలంకి చెందిన ఎం.శ్వేత..., పేదరాలనైన తనకు ఎలాంటి నివాసం లేదని, ప్రభుత్వం ద్వారా ఇల్లు మంజూరు చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. ఈ కార్యక్రమంలో మొత్తం 279 అర్జీలు రాగా వాటిపై తగు చర్య తీసుకొని పరిష్కరించు నిమిత్తం సంబంధిత శాఖల అధికారులకు జాయింట్ కలెక్టర్, సబ్ కలెక్టర్ ఎండార్స్ చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## ఘనంగా వీరభద్ర స్వామి పల్లకి పూజ



**అన్నమయ్య బ్యూరో - సూర్య వాస్తవం :** అన్నమయ్య జిల్లా రాయచోటి టౌన్ యందు వెలసిన శ్రీ భద్రకాళి సమేత వీరభద్ర స్వామి దేవస్థానం నందు ప్రతి సోమవారం పల్లకి సేవ పూజా కార్యక్రమం నిర్వహిస్తున్నందున స్థానిక భక్తులు కర్ణాటక రాష్ట్రం నుండి విచ్చేసిన భక్తులు ఈ పూజా కార్యక్రమం నందు పాల్గొన్నారు వారికి దేవస్థానం అర్చక స్వాములు అర్చనలు చేసి తీర్థ ప్రసాదాలు అందించారని దేవస్థానం చైర్మన్ తిరుమల మనోజ్ కుమార్ దేవస్థాన కార్యనిర్వాహన అధికారి డివి రమణారెడ్డి తెలియజేశారు.

# దేవుడిగా రాజేంద్రప్రసాద్, భక్తుడిగా శ్రీకాంత్...
# ఆసక్తికరంగా 'మిస్టర్ మిడిల్ క్లాస్' ట్రైలర్

- శ్రీకాంత్, రాజేంద్రప్రసాద్ ప్రధాన పాత్రల్లో 'మిస్టర్ మిడిల్ క్లాస్'
- విడుదలైన సినిమా ట్రైలర్... ఆకట్టుకుంటున్న కామెడీ, భక్తి అంశాలు
- వెంకటేశ్వర స్వామిగా రాజేంద్రప్రసాద్, భక్తుడిగా శ్రీకాంత్ నటన
- కామెడీ, ఎమోషన్, థ్రిల్లర్ అంశాలతో ఫ్యామిలీ ఎంటర్‌టైనర్
- జూలై 17న థియేటర్లలోకి రానున్న చిత్రం




సీనియర్ నటులు శ్రీకాంత్, రాజేంద్రప్రసాద్ కాంబినేషన్‌లో వస్తున్న చిత్రం 'మిస్టర్ మిడిల్ క్లాస్'. ఈ సినిమాకు సంబంధించిన ట్రైలర్‌ను సోమవారం విడుదల చేశారు. కామెడీ, ఎమోషన్, భక్తి అంశాల కలబోతగా ఉన్న ఈ ట్రైలర్ ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఈ చిత్రం జూలై 17న థియేటర్లలో విడుదల కానుంది. వివరాల్లోకి వెళితే, ఈ చిత్రంలో రాజేంద్రప్రసాద్ వెంకటేశ్వర స్వామి పాత్రలో కనిపించనుండగా, ఆయన భక్తుడిగా శ్రీకాంత్ నటిస్తున్నారు. ఒక మధ్యతరగతి వ్యక్తికి అనూహ్యంగా సంపద వస్తే అతని జీవితంలో ఎలాంటి మార్పులు, సవాళ్లు ఎదురయ్యాయి అనే కథాంశంతో ఈ సినిమాను రూపొందించారు. కామెడీతో పాటు ఎమోషనల్, థ్రిల్లర్ సన్నివేశాలు కూడా ఉంటాయని ట్రైలర్ ద్వారా తెలుస్తోంది. గతంలో పలు విజయవంతమైన చిత్రాల్లో కలిసి నటించిన శ్రీకాంత్, రాజేంద్రప్రసాద్ మళ్లీ తెరపై సందడి చేయనుండటంతో సినిమాపై అంచనాలు పెరిగాయి. ప్రముఖ దర్శకుడు జి. నాగేశ్వరరెడ్డి దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో లయ కథానాయికగా నటించారు. బాలు జె క్రియేషన్స్ బ్యానర్‌పై ఈ సినిమాను నిర్మించారు. సునీల్, అలీ, వెన్నెల కిశోర్, పృధ్వీరాజ్, ధన్‌రాజ్ వంటి ప్రముఖ హాస్యనటులు కీలక పాత్రలు పోషించగా, సాయికార్తీక్ సంగీతం అందించారు. తాజాగా, ఈ చిత్రం ప్రీ-రిలీజ్ వేడుకను ఘనంగా నిర్వహించారు. మధ్యతరగతి కుటుంబం యొక్క కలలు, కష్టాల నేపథ్యంలో పూర్తిస్థాయి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రం రాబోతోంది.

## అఖిల్ 'లెనిన్'ను మెచ్చుకున్న చిరంజీవి..
## నాగార్జున రిప్లై ఇదే!

- అఖిల్ నటించిన 'లెనిన్' చిత్రంపై మెగాస్టార్ ప్రశంసల వర్షం
- త్వరలోనే సినిమా చూస్తానని, చిత్ర విజయంపై ఆనందం వ్యక్తం
- చిరంజీవి ట్వీట్‌కు స్పందించి ధన్యవాదాలు తెలిపిన నాగార్జున
- తప్పకుండా మీకు ఈ సినిమా నచ్చుతుందని నాగ్ రిప్లై
- ఇద్దరు అగ్ర హీరోల సంభాషణ సోషల్ మీడియాలో వైరల్



అక్కినేని అఖిల్ హీరోగా నటించిన తాజా చిత్రం 'లెనిన్' బాక్సాఫీస్ వద్ద పాజిటివ్ టాక్‌తో విజయవంతంగా ప్రదర్శితమవుతోంది. మురళీ కిశోర్ అబ్బూరు దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రంలో అఖిల్ నటనకు సర్వత్రా ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. ఈ క్రమంలో మెగాస్టార్ చిరంజీవి చిత్ర బృందాన్ని, ముఖ్యంగా అఖిల్‌ను అభినందిస్తూ సోషల్ మీడియాలో చేసిన పోస్ట్ ఇండస్ట్రీలో ఆసక్తిని రేకెత్తించింది. 'లెనిన్' చిత్రం గురించి అద్భుతమైన విషయాలు వింటున్నానని, సినిమా ఇంకా చూడనప్పటికీ అందరి నుంచి వస్తున్న ప్రశంసలు చూసి చాలా సంతోషంగా ఉందని చిరంజీవి తన పోస్టులో పేర్కొన్నారు. అఖిల్ నటనకు దక్కుతున్న ఆదరణ చూసి చాలా ఆనందంగా ఉందని, అతడు త నకు మరో కొడుకు లాంటివాడని పేర్కొన్నారు. అలాగే నాగార్జునకు, చిత్ర బృందానికి అభి నందనలు తెలిపారు. త్వరలోనే 'లెనిన్' సినిమా చూడాలని ఆసక్తిగా ఎదురుచూస్తున్నానని చిరు తన ట్వీట్‌లో చెప్పుకొచ్చారు. చిరంజీవి ట్వీట్‌పై కింగ్ నాగార్జున వెంటనే స్పందించారు. ఆయనకు ధన్యవాదాలు తెలుపుతూ రిప్లై ఇచ్చారు. "చిరంజీవి గారూ, అఖిల్ పట్ల మీకున్న ఆప్యాయత, 'లెనిన్' కోసం మీరు తెలిపిన శుభాకాంక్షలు మా ఈ వేడుకను మరింత చిరస్మరణీయంగా మార్చాయి. మీకు తప్పకుండా ఈ సినిమా నచ్చుతుంది. మీరు సినిమా చూశాక మీ అభిప్రాయాన్ని తెలుసుకోవడానికి ఆసక్తిగా ఎదురుచూస్తుంటాను" అని నాగార్జున పేర్కొన్నారు. ప్రస్తుతం టాలీవుడ్‌లోని ఇద్దరు అగ్ర హీరోల మధ్య జరిగిన ఈ స్నేహపూర్వక సంభాషణ సోషల్ మీడియాలో వైరల్ అవుతూ.. 'లెనిన్' సినిమా విజయోత్సాహాన్ని మరింత పెంచింది.



## "నాకిద్దరు కూతుళ్లు ఉన్నారు.. ఉద్యోగం ఇవ్వండి".. తండ్రి కష్టాలను గుర్తుచేసుకున్న భాగ్యశ్రీ బోర్సే

- తండ్రి ఉద్యోగం కోల్పోవడంతో కష్టాల్లో పెరిగానన్న భాగ్యశ్రీ బోర్సే
- ప్రతి రూపాయికి లెక్క వేసుకుంటూ కుటుంబం గడిచేదని వెల్లడి
- తల్లిదండ్రుల కోసమే విజయాన్ని లక్ష్యంగా పెట్టుకున్నానని వ్యాఖ్య
- 'లెనిన్' సక్సెస్ తర్వాత చిన్ననాటి జ్ఞాపకాలు పంచుకున్న నటి

'లెనిన్' సినిమాతో మంచి గుర్తింపు తెచ్చుకున్న నటి భాగ్యశ్రీ బోర్సే. తాజాగా చిన్ననాటి జీవితంలోని కష్టాలను గుర్తు చేసుకుంటూ భావోద్వేగ వ్యాఖ్యలు చేసింది. తాను పుట్టిన వెంటనే తండ్రి ఉద్యోగం కోల్పోయారని, ఆ తర్వాత కుటుంబం ఎన్నో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నట్లు చెప్పింది. తమది దిగువ మధ్యతరగతి కుటుంబమని, చిన్నప్పటి నుంచి తల్లిదండ్రులు తమ కోసం ఎంత కష్టపడ్డారో కళ్లారా చూశానని తెలిపింది. ఇంట్లో ప్రతి రూపాయిని ఎంతో జాగ్రత్తగా ఖర్చు చేసేవారని భాగ్యశ్రీ చెప్పింది. రూ.10 పచ్చిమిర్చి, రూ.10 పాలకూర కొనుగోలు చేసిన వివరాలనూ నోట్‌బుక్‌లో రాసుకునేవారని, ఒక వారం రూ.300 ఖర్చయితే తర్వాతి వారం ఎలా గడపాలా అని తల్లిదండ్రులు ఆలోచించేవారని గుర్తు చేసుకుంది. చిన్నతనంలో డబ్బు విలువ తెలియకపోయినా, పెరిగేకొద్దీ తల్లిదండ్రుల కష్టాలు అర్థమయ్యాయని వివరించింది. తన జీవితంలో ఎన్నటికీ మర్చిపోలేని ఓ సంఘటనను భాగ్యశ్రీ గుర్తు చేసుకుంది. "నాకు ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.. దయచేసి నాకు ఉద్యోగం ఇవ్వండి" అంటూ తన తండ్రి ఒకరి వద్ద వేడుకున్నారని తెలిపింది. చిన్న వయసులో తండ్రిని ఆ స్థితిలో చూడటం చాలా బాధ కలిగించిందని చెప్పింది. అప్పుడే ఆయన మళ్లీ ఎప్పుడూ అలాంటి పరిస్థితిని ఎదుర్కోకూడదని నిర్ణయించుకున్నానని, జీవితంలో తాను సాధించాలనుకున్న ప్రతి లక్ష్యం వెనుక తల్లిదండ్రులే ప్రేరణగా ఉన్నారని వెల్లడించింది. ఔరంగాబాద్‌కు చెందిన భాగ్యశ్రీ బోర్సే కొంతకాలం నైజీరియాలో చదువుకుని, తర్వాత ముంబైలో మోడలింగ్ ప్రారంభించింది. బాలీవుడ్‌లో చిన్న పాత్రలతో కెరీర్ ప్రారంభించిన ఆమెకు రవితేజ సరసన నటించిన 'మిస్టర్ బచ్చన్' సినిమా మంచి గుర్తింపు తీసుకొచ్చింది. అనంతరం విజయ్ దేవరకొండ, దుల్కర్ సల్మాన్, రామ్ పోతినేని వంటి హీరోలతో నటించింది. ఇటీవల అఖిల్ అక్కినేని సరసన నటించిన 'లెనిన్' సినిమాతో భారీ విజయాన్ని తన ఖాతాలో వేసుకుంది.



# లార్డ్స్‌లో చరిత్ర సృష్టించిన టీమిండియా...
## ఏకైక టెస్టులో ఇంగ్లండ్‌ను చిత్తుచేసిన హర్మన్ ప్రీత్ సేన

- లార్డ్స్‌లో జరిగిన చారిత్రక టెస్టులో ఇంగ్లండ్‌పై భారత్ 270 పరుగుల భారీ విజయం
- సంపూర్ణ ఆధిపత్యం ప్రదర్శించిన హర్మన్‌ప్రీత్ సేన తొలి ఇన్నింగ్స్‌లో 5 వికెట్లతో క్రాంతి గౌడ్ అద్భుత ప్రదర్శన
- రెండో ఇన్నింగ్స్‌లో సెంచరీతో యస్తికా భాటియా, స్మృతి మంధాన రెండు ఇన్నింగ్స్‌లలో హాఫ్ సెంచరీలతో కీలక పాత్ర



లండన్‌లోని చారిత్రక లార్డ్స్ మైదానంలో భారత మహిళల క్రికెట్ జట్టు సరికొత్త చరిత్ర సృష్టించింది. 142 ఏళ్ల లార్డ్స్ చరిత్రలో జరిగిన మొట్టమొదటి మహిళల టెస్టు మ్యాచ్‌లో ఇంగ్లండ్‌పై 270 పరుగుల భారీ తేడాతో అద్భుత విజయాన్ని నమోదు చేసింది. ఆఫ్‌స్పిన్నర్ స్నేహ్ రాణా (4/42) అద్భుత బౌలింగ్‌తో చెలరేగగా, దీప్తి శర్మ (2/36) ఆమెకు చక్కటి సహకారం అందించింది. భారత స్పిన్నర్ల ధాటికి ఇంగ్లండ్ జట్టు రెండో ఇన్నింగ్స్‌లో 186 పరుగులకే కుప్పకూలింది. దీంతో హర్మన్‌ప్రీత్ కౌర్ నేతృత్వంలోని జట్టు క్రికెట్ మక్కాలో చిరస్మరణీయ విజయాన్ని తన ఖాతాలో వేసుకుంది.

457 పరుగుల అసాధ్యమైన లక్ష్య ఛేదనతో సోమవారం నాలుగో రోజు ఆట ప్రారంభించిన ఇంగ్లండ్, 130/6 ఓవర్‌నైట్ స్కోరుతో బరిలోకి దిగింది. ఓటమిని తప్పించుకోవాలన్న ఇంగ్లండ్ ఆశలు ఆ జట్టు బ్యాటర్ అమీ జోన్స్‌పైనే ఆధారపడ్డాయి. అయితే, ఆట ప్రారంభమైన మూడో ఓవర్‌లోనే స్నేహ్ రాణా అద్భుతం చేసింది. ఆమె వేసిన బంతిని పుల్ చేసిన అమీ జోన్స్ (54), మిడ్-వికెట్ వద్ద ఉన్న షఫాలీ వర్మకు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగింది. దీంతో ఇంగ్లండ్ ఓటమి ఖాయమైంది. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన ఇసీ వాంగ్, సోఫీ ఎక్లెస్టోన్ దాదాపు 10 ఓవర్ల పాటు వికెట్ పడకుండా అడ్డుకున్నా, పరుగులు చేయడంలో విఫలమయ్యారు. ఈ భాగస్వామ్యాన్ని దీప్తి శర్మ విడదీసింది. ఆమె వేసిన అద్భుతమైన బంతికి ఇసీ వాంగ్ క్లీన్ బౌల్డ్ అయింది. ఒకవైపు వికెట్లు పడుతున్నా, మరో ఎండ్‌లో సోఫీ ఎక్లెస్టోన్ ఒంటరి పోరాటం చేసింది. క్రాంతి గౌడ్, దీప్తి శర్మ బౌలింగ్‌లో బౌండరీలు బాది స్కోరు బోర్డును ముందుకు నడిపింది. అయితే, లారెన్ బెల్‌ను దీప్తి శర్మ బోల్తా కొట్టించడంతో ఇంగ్లండ్ 159 పరుగులకే 9 వికెట్లు కోల్పోయింది. ఈ దశలో సోఫీ తన తొలి టెస్టు హాఫ్ సెంచరీని 61 బంతుల్లో పూర్తి చేసుకుంది. కానీ, అద్భుతంగా బౌలింగ్ చేసిన స్నేహ్ రాణా, సోఫీ ఎక్లెస్టోన్‌ను (50) క్లీన్ బౌల్డ్ చేసి భారత చారిత్రక విజయాన్ని ఖరారు చేసింది. ఈ చరిత్రాత్మక విజయంలో స్నేహ్ రాణాతో పాటు ఇతర భారత క్రీడాకారిణులు కూడా అద్భుత ప్రదర్శన చేశారు. రెండో ఇన్నింగ్స్‌లో యస్తికా భాటియా (113) అద్భుత సెంచరీతో చెలరేగింది. లార్డ్స్ మైదానంలో టెస్టు సెంచరీ చేసిన తొలి మహిళా క్రికెటర్‌గా ఆమె రికార్డు సృష్టించింది. వైస్ కెప్టెన్ స్మృతి మంధాన రెండు ఇన్నింగ్స్‌లలో (83, 70) హాఫ్ సెంచరీలతో రాణించగా, రిచా ఘోష్ కేవలం 52 బంతుల్లోనే 50 పరుగులు చేసి అజేయంగా నిలిచింది. తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 285 పరుగులు చేయగా, ఇంగ్లండ్ 170 పరుగులకు ఆలౌట్ అయింది. రెండో ఇన్నింగ్స్‌లో భారత్ 341/7 వద్ద డిక్లేర్ చేసింది. ఈ విజయంతో, గత 11 టెస్టుల్లో భారత్‌కు ఇది ఏడో గెలుపు కాగా, ఇంగ్లండ్ గడ్డపై టెస్టుల్లో తమ అజేయ రికార్డును కొనసాగించింది. దిగ్గజ క్రికెటర్ సచిన్ టెండూల్కర్, ఐసీసీ ఛైర్మన్ జై షా, బీసీసీఐ ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా వంటి ప్రముఖుల సమక్షంలో ఈ విజయం దక్కడం విశేషం. ఈ చారిత్రక విజయంతో రెడ్ బాల్ క్రికెట్‌లో భారత మహిళల జట్టు తమ ఆధిపత్యాన్ని మరోసారి నిరూపించుకుంది. గత 11 టెస్టుల్లో భారత్ ఏడు విజయాలు, మూడు డ్రాలు సాధించి, కేవలం ఒక్క మ్యాచ్‌లో మాత్రమే ఓడిపోయింది. ఇంగ్లాండ్ గడ్డపై భారత మహిళల జట్టుకు ఇది 11వ టెస్టు కాగా, ఆ దేశంలో ఈ ఫార్మాట్‌లో మన జట్టుకు ఇప్పటి వరకు ఓటమన్నదే లేదు. 3 మ్యాచ్ ల్లో గెలిచిన భారత అమ్మాయిలు, 8 మ్యాచ్ లు డ్రా చేసుకున్నారు.



## జూన్ 'ప్లేయర్ ఆఫ్ ది మంత్' అవార్డుకు నామినేషన్లలో శుభ్‌మన్ గిల్

- జూన్‌లో బ్యాట్‌తో అద్భుత ప్రదర్శన కనబర్చిన గిల్
- బంగ్లాదేశ్ ఆల్‌రౌండర్ మొసద్దెక్ హుస్సేన్ కూడా రేసులో
- పోటీలో ఉన్న న్యూజిలాండ్ ఫాస్ట్ బౌలర్ నాథన్ స్మిత్
- ఆఫ్ఘన్‌తో వన్డే, టెస్టు ఫార్మాట్‌లో అద్భుతంగా రాణించిన గిల్
- వన్డే సిరీస్‌లో రెండు ఇన్నింగ్స్‌ల్లోనే 238 పరుగులు

జూన్ నెలకు గానూ ఐసీసీ పురుషుల 'ప్లేయర్ ఆఫ్ ది మంత్' అవార్డుకు భారత జట్టు కెప్టెన్ శుభ్‌మన్ గిల్ నామినేట్ అయ్యాడు. జూన్ నెలలో బ్యాట్‌తో అద్భుత ప్రదర్శన కనబర్చిన గిల్‌తో పాటు బంగ్లాదేశ్ ఆల్‌రౌండర్ మొసద్దెక్ హుస్సేన్, న్యూజిలాండ్ ఫాస్ట్ బౌలర్ నాథన్ స్మిత్ కూడా ఈ అవార్డు కోసం పోటీలో ఉన్నట్లు ఐసీసీ సోమవారం ప్రకటించింది. ఆఫ్ఘనిస్థాన్‌తో జరిగిన హోం సిరీస్‌లో గిల్ టెస్టు, వన్డే ఫార్మాట్లలో అద్భుతంగా రాణించాడు. న్యూ చండీగఢ్‌లో జరిగిన ఏకైక టెస్టులో 126 పరుగులు చేసి భారత ఇన్నింగ్స్ విజయానికి కీలకంగా నిలిచాడు. అనంతరం వన్డే సిరీస్‌లో రెండు ఇన్నింగ్స్‌ల్లోనే 238 పరుగులు సాధించాడు. తొలి వన్డేలో 66 బంతుల్లో 84 పరుగులు చేసిన గిల్, లక్నో వన్డేలో కాళ్ల నొప్పితో ఇబ్బంది పడుతూనే 110 బంతుల్లో 154 పరుగులు చేసి భారత్‌కు విజయం అందించాడు. ఆ మ్యాచ్‌తో పాటు సిరీస్‌లోనూ అత్యుత్తమ ఆటగాడిగా నిలిచి, భారత్ 3-0తో సిరీస్‌ను కైవసం చేసుకోవడంలో కీలక పాత్ర పోషించాడు. నాలుగేళ్ల విరామం తర్వాత అంతర్జాతీయ క్రికెట్‌లోకి తిరిగి వచ్చిన బంగ్లాదేశ్ ఆల్‌రౌండర్ మొసద్దెక్ హుస్సేన్ ఆస్ట్రేలియాపై తన జట్టుకు చారిత్రక 2-1 వన్డే సిరీస్ విజయం అందించడంలో కీలక పాత్ర పోషించాడు. మరోవైపు, న్యూజిలాండ్ పేసర్ నాథన్ స్మిత్ ఇంగ్లండ్‌తో జరిగిన టెస్టు సిరీస్‌లో 16 వికెట్లు పడగొట్టి 2-1తో సిరీస్ గెలవడంలో ప్రధాన పాత్ర పోషించాడు. ఈ ప్రదర్శనలతో ఇద్దరూ జూన్ నెల ఐసీసీ 'ప్లేయర్ ఆఫ్ ది మంత్' అవార్డు రేసులో చోటు దక్కించుకున్నారు.

## ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను

# మరో 3 నెలలపాటు పొడించాలి

**- సిపిఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య**



**పత్తికొండ టౌన్ – సూర్య వాస్తవం :** ఆంధ్రప్రదేశ్లో భారత ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల ప్రత్యేక సమగ్ర నవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో అర్హులైన ఓట్ల గల్లంతు, ఫారాల నింపడంలో ఇబ్బందులు, బీఎల్ వోల అలసత్వం, రాజకీయ ప్రమేయం వంటి ప్రధాన సమస్యలు వెలుగుచూస్తున్నాయి. ఈ నెల 14వ తేదీకీ రాష్ట్రంలో ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ పూర్తవుతుందని ప్రకటించారు. గడువు ముగింపు దశకు చేరుకున్నప్పటికీ ఇంకా చాలా మంది ఓటర్ల వివరాలు నమోదు కాకపోవడం ఆందోళన కలిగిస్తోంది. అని సిపిఐ జిల్లా కార్యదర్శి బీ.గిడ్డయ్య అన్నారు. ముందుగా స్థానిక చదువులు రామయ్య భవన్ నుండి ర్యాలీగా బయలుదేరి స్థానిక నాలుగు స్తంభాల కూడలిలో ధర్నా నిర్వహించడం జరిగింది ఈ ధర్నా కార్యక్రమానికి సిపిఐ మండల కార్యదర్శి యు కారుమంచి అధ్యక్షతన నిర్వహించడం జరిగింది తదనంతరం సిపిఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య గారు మాట్లాడుతూ ప్రజాస్వామ్య భారత దేశంలో రాజ్యాంగం భారతీయులకు సార్వత్రిక ఓటు హక్కును కల్పించింది. ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ . (ఎస్ఐఆర్) కార్యక్రమం చేపట్టక ముందు దేశ ప్రజల్లో అర్హులందరినీ ఓటర్లుగా నమోదు చేయడానికి ప్రాధాన్యమిచ్చారు. ఫొటో గుర్తింపు కార్డులు లేకున్నా ఓటరు జాబితాలో పేరుంటే చాలు, వేరే ఏదైనా గుర్తింపు పత్రంతో ఓటు వేసే వెసులుబాటు కల్పించబడింది. దీనివలన భారతీయ పౌరులందరికీ ఓటుహక్కు ఉండేది. దేశంలో దీర్ఘకాలం నివసించి భారతీయ పౌరసత్వం పొందినవారు తప్ప, విదేశీయులెవరూ ఓటు వేసేందుకు వీలుండేది కాదు. కాని ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమం దానికి గండికొడుతోంది. మరణించిన ఓటర్ల పేర్లను, శాశ్వతంగా వలసపోయినవారిని, నకిలీ ఓటర్లను తొలగించడం ఎస్ఐఆర్ ఉద్దేశమని ఎన్నికల కమిషన్ చెబుతున్నప్పటికీ, వాస్తవం అందుకు భిన్నంగా ఉంటున్నది.

ఎన్యూమరేషన్ పత్రాలను కొందరు ఆన్లైన్లో సమర్పించారు. ఈ పద్ధతిలో ఓటరు మొబైల్ ఫోన్ నెంబర్ను ఆధార్, ఓటర్ల ఫొటో గుర్తింపు కార్డు (ఎపిక్) లతో అనుసంధానించాలి. ఆ రెండింటిలో పేర్లు ఒకే విధంగా ఉండాలి. కాని ఎన్యూమరేషన్ పత్రాలను చేతిరాతతో నింపేటప్పుడు ఆధార్ నంబర్ లేకపోయినా ఫర్వాలేదు. ఆన్లైన్లో ఆధార్ ఈ సైన్ తప్పనిసరి. ఓటరు ఆన్లైన్లో ఎన్యూమరేషన్ స్థితిని తెలుసుకోవడానికి ఎన్నికల కమిషన్ వెబ్సైట్ను మళ్లీ తెరిచినప్పుడు మరోసారి కొత్త ఫారాన్ని నింపాలనే సందేశం కనిపిస్తోంది. ఓటర్లు తమ ఎన్యూమరేషన్ ఫారాలను బీఎల్ వోలకు సమర్పించి, అవి అప్లోడ్ అయిన సందర్భాల్లో మాత్రమే మీ ఫారాలను ఇప్పటికే సమర్పించారనే సందేశం వస్తోంది. ఆన్లైన్లో ఫారాలను సమర్పించినవారికి మాత్రం అలాంటిది రావడంలేదు. ఫొటో గుర్తింపు కార్డు ఉన్న ఓటర్లు తమ 'ఎపిక్' స్థితి గురించి ఎన్నికల సంఘం వెబ్సైట్లో వెతికితే 'ఎలాంటి ఫలితం లభించలేదన్న సమాధానం వస్తోంది. బహుశా వారి పేర్లను ఉద్దేశ పూర్వకంగా లేదా అనుకోకుండా తొలగించి ఉండవచ్చు. నిజమైన ఎపిక్ కార్డు ఉన్న వారికి ఎన్యూమరేషన్ ఫారాలు ఇవ్వనందువల్ల తాజా ముసాయిదా జాబితాలో పేర్లు కనిపించని దుస్థితి నెలకొంది. ఏదైనా రాజకీయ కారణంతో ఎన్యూమరేషన్ ఫారాలను బిఎల్వోలు అప్లోడ్ చేయకపోతే వారి ఓట్లు గల్లంతయ్యే ప్రమాదముంది. కొందరు ఓటర్లకు ఎపిక్ కార్డులు లేకపోయినా 2002–2003 నాటి ఎస్ఐఆర్ జాబితాలలో వారి పేర్లు, లేదా వారి తల్లిదండ్రులు, తాతలు, బంధువుల పేర్లు ఉన్న వారందరూ ఈసీ పౌరసత్వ పరీక్షలో నెగ్గాల్సి ఉంటుంది. కానీ, వారికి ఎన్యూమరేషన్ ఫారాలు అందలేదు కాబట్టి, వారి పేర్లూ సవరించిన ఓటరు జాబితాలలో కనిపించే అవకాశం లేదు.

మరికొందరు ఓటర్ల పేర్లు ప్రస్తుత జాబితాలలో ఉన్నప్పటికీ ఏదైనా కారణం వల్ల ప్రభుత్వం ఆ ప్రాంతవాసులను వేరే చోటికి తరలిస్తే, వారు కొత్త నియోజకవర్గంలోకి వస్తారంటూ బీఎల్ వోలు ఎన్యూమరేషన్ ఫారాలు ఇవ్వలేదు. అందువల్ల వారి పేర్లూ అదృశ్యమయ్యాయి. ఎస్ఐఆర్ వల్ల ఓటరు జాబితాల నుంచి అదృశ్యమైన అర్హులు అసలు ఎప్పటికైనా ఓటర్లుగా గుర్తింపు పొందగలరా లేదా అనే సందేహం ఎదురవుతోంది. ఇంటింటి సర్వే ద్వారా ఓటర్లను నమోదు చేయాల్సింది పోయి, ఎస్ఐఆర్ పేరుతో ఎన్యూమరేషన్ ఫారాలు నింపాలనడంతో ఎంతో మంది ఓటు హక్కు కోల్పోయే పరిస్థితి తలెత్తింది. అర్హులైనవారు ఓటు హక్కు కోల్పోవడం ప్రజాస్వామ్యానికి పెను విఘాతం.ఏపీలో ఇప్పటివరకూ చాలాచోట్ల 50% కూడా ఓటర్ల ఎన్యూమరేషన్ ప్రక్రియ పూర్తికాలేదు. సరైన సమాచారం అందకపోవడం, సాంకేతిక లోపాల వల్ల చాలామంది అర్హులైన ఓటర్ల పేర్లు జాబితా నుంచి తొలగిపోయే ప్రమాదం ఏర్పడింది. ఎన్యూమరేషన్ ఫారాలను నింపడంలో ప్రజలకు అవగాహన లోపించడం, క్షేత్రస్థాయిలో ఉన్న నిబంధనలు అర్థం కాకపోవడం వల్ల ఓటర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చాలా ప్రాంతాల్లో బీఎల్ వోలు ఇళ్లకు వెళ్లి సర్ పత్రాలు ఇవ్వకపోవడం, సమయానికి నమోదు ప్రక్రియ పూర్తి చేయకపోవడం వంటి నిర్లక్ష్యం కనిపిస్తోంది. అంతేకాకుండా విపక్షాల ఓట్లను తొలగించడానికి ఈ ప్రక్రియను దుర్వినియోగం చేస్తున్నారనే అనుమానాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను మరో 3 నెలలపాటు పొడిగించి, అర్హులైన అందరూ ఓటు హక్కు పొందేవిధంగా నిర్దిష్ట చర్యలు చేపట్టవలసిందిగా కోరుతున్నాము. అని వారన్నారు తదనంతరం (=ణా)ఆర్ డి ఓ గారికి వినత పత్రం ఇవ్వడం జరిగింది ఈ కార్యక్రమానికి యు .కారుమంచి అధ్యక్షతన జరిగింది ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు నబి రసూల్. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు ఎన్ కృష్ణయ్య .తుగ్గల మండల కార్యదర్శి సుల్తాన్ .పట్టణ కార్యదర్శి రామాంజనేయులు .జిల్లా సమితి సభ్యులు సురేంద్ర కుమార్ పెద్ద ఈరన్న నెట్టికంటయ్య .మండల సహాయ కార్యదర్శి జోల్లాపురం కాసిం. వ్యవసాయ కార్మిక సంఘం తాలూకా అధ్యక్ష కార్యదర్శులు నాగరాజు .వెంకటరామిరెడ్డి. ఏ ఐ టి యు సి నాయకులు గుండు బాషా. మాదన్న .ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి సిద్దలింగప్ప .పట్టణ సహాయ కార్యదర్శి ఎంకే సుంకన్న. కాన్ . ఎస్ఎఫ్ మండల కార్యదర్శి శివ. శాఖా కార్యదర్శులు రవికుమార్. ఆంజనేయులు .హనుమంతు .రవి .నాగేంద్రయ్య. శంకర్ మహిళా సమైక్య నాయకురాలు సుంకమ్మ. లక్ష్మీదేవి. తదితరులు పాల్గొన్నారు

# ఎస్ఐఆర్ ప్రక్రియను పొడిగించాలని వినతి


**- తహశీల్దార్‌కి వినతిపత్రం అందజేసిన సిపిఐ బనగానపల్లె మండల సమితి నాయుకలు**



**బనగానపల్లె – సూర్య వాస్తవం :** ఆంధ్రప్రదేశ్‌లో భారత ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల ప్రత్యేక సమగ్రసవరణ ప్రక్రియలో అర్హులైన ఓట్ల గల్లంతు పారాలను నింపడంలో ఇబ్బందులు బిఎల్వోల అలసత్వం రాజకీయ ప్రమేయం వంటి ప్రధాన సమస్యలు వెలుగుచూస్తున్నాయి ఈనెల 14వ తేదకి రాష్ట్రంలో ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తవుతుందని ప్రకటించారు గడువు ముగింపు పూర్తి కావస్తున్నప్పటికీ చాలామంది ఓటర్ల వివరాలు నమోదు కాకపోవడం ఆందోళన కలిగిస్తుంది దేశంలో ప్రజాస్వామ్య భారతదేశంలో రాజ్యాంగం భారతీయులకు సార్వత్రిక ఓటు హక్కు కల్పించింది ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో చేపటకముందే దేశ ప్రజల్లో అర్హులందరినీ ఓటర్లుగా నమోదు చేయడానికి ప్రాధాన్య తనిచ్చారు. ఫోటో గుర్తింపు కార్డు లేకుండా ఓటర్ జాబితాలో పేరు ఉంటే చాలు వేరే ఏదైనా గుర్తింపు పత్రంతో ఓటు వేసే వెసులుబాటు కల్పించబడింది దీనివలన భారతీయ పౌరులందరికీ హోటాకు ఉండేది దేశంలో దీర్ఘకాలం నివసించి భారతీయ పౌరసత్వం పొందిన వారు తప్ప విదేశీయులు ఎవరు ఓటు వేసేందుకు వీలు ఉండేది కాదు. కానీ ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం దానికి గండి కొడుతుంది మరణించిన ఓటర్ల పేర్లను శాశ్వతంగా వలస పోయిన వారిని నకిలీ ఓట్లను తొలగించడం ఎస్ఐఆర్ ఉద్దేశమని ఎన్నికల కమిషన్ చెబుతున్నప్పటికీ వాస్తవం అందుకు భిన్నంగా ఉంటుంది. ఏమిమరేషన్ పత్రాలను కొందరు ఆన్లైన్లో సమర్పించారు ఈ పద్ధతిలో ఓటర్ మొబైల్ ఫోన్ నెంబర్ను ఆధార్ ఓటర్ల ఫోటో గుర్తింపు కార్డులతో అనుసంధానించాలి ఆ రెండిటిలో పేర్లు ఒకే విధంగా ఉండాలి కానీ ఇన్మినేషన్ పత్రాలను చేతిరాతతో నింపేటప్పుడు ఆధార్ నెంబర్ లేకపోయినా పరవాలేదు ఆన్లైన్లో ఆధార్ మిస్సైన్ తప్పనిసరి అని ఓటర్ ఆన్లైన్ లో ఎనిమరేషన్ స్థితిని తెలుసుకోవడానికి ఎన్నికల కమిషన్ వెబ్సైట్లను మళ్లీ తెచ్చినప్పుడు మరోసారి కొత్తఫారాన్ని నింపేలా సందేశం కనిపిస్తుంది ఓటర్లు తమ ఎనిమరేషన్ ఫారాలను బిఎల్ఓ లకు సమర్పించి అవి అప్లోడ్ అయిన సందర్భంలో మాత్రమే మీ ఫారాలను ఇప్పటికే సమర్పించారని సందేశం వస్తుంది ఆన్లైన్లో ఫారాలను సమర్పించిన వారికి మాత్రం అలాంటిది రావడం లేదు ఫోటో గుర్తింపు కార్డు ఉన్న ఓటర్లు తమ ఎపెక్షితి గురించి ఎన్నికల సంఘం వెబ్సైట్లో వెతికితే ఎలాంటి ఫలితం లభించలేదన్న సమాధానం వస్తుంది బహుశా వారి పేర్లను ఉద్దేశపూర్వకంగా లేదా అనుకోకుండా తొలగించి ఉండవచ్చుకొందరు ఓటర్లకు ఎపిక్ కార్డు లేకపోయినా 2002 2003 నాటి ఎస్ఐఆర్ జాబితాలలో వారి పేర్లు లేదా వారి తల్లిదండ్రుల తాతల బంధువుల పేర్లు ఉన్న వారందరూ ఈసీ పౌరసత్వం పరీక్షలో నెగ్గాలి ఉంటుంది కానీ వారికి ఎన్నిమరేషన్ ఫారాలు అందలేదు కాబట్టి వారి పేర్లు సవరించిన ఓటర్ల జాబితాలో కనిపించే అవకాశం లేదు. ఆంధ్రప్రదేశ్లో ఇప్పటివరకు చాలాచోట్ల 50 శాతం కూడా ఓటర్ల ఎనిమరేషన్ ప్రక్రియ పూర్తికాలేదు సరైన సమాచారం అందకపోవడం సాంకేతిక లోపాల వల్ల చాలామంది అర్హులైన ఓటర్ల పేర్లు జాబితా నుంచి తొలగిపోయాయి ప్రమాదం ఏర్పడింది ఎనిమరేషన్ ఫారాలను నింపడంలో ప్రజలకు అవగాహన లోపించడం క్షేత్రస్థాయి ఉన్న నిబంధనలు అర్థం కాకపోవడం వల్ల ఓటర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు చాలా ప్రాంతాల్లో బిఎల్వోలు ఇలకు వెళ్లి సర్ పత్రాలు ఇవ్వకపోవడం సమయానికి నమోదు ప్రక్రియ పూర్తి చేయకపోవడం వంటి నిర్లక్ష్యం కనిపిస్తుంది అంతేకాకుండా విపక్షాల ఓట్లను తొలగించడానికి ఈ ప్రక్రియను దుర్వినియోగం చేస్తున్నారనే అనుమానాలు సర్వత్ర వ్యక్తం అవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్లో రాష్ట్రంలో ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను మరో మూడు నెలల పాటు పొడిగించి అర్హులైన అందరూ ఓట్ల ఆక్కున పొందే విధంగా నిర్దిష్ట చర్యలు చేపట్ట వలసిందిగా కోరుతున్నాము. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి శివయ్య, సిపిఐ జిల్లా సమితి సభ్యులు సంజీవులు, ఏఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎర్రి స్వామి, సిపిఐ పలుకూరు గ్రామ శాఖ కార్యదర్శి బాలయ్య, మహిళా సమైక్య మండల కార్యదర్శి స్వరూప, ఏఐఎస్ఎఫ్ బనగానపల్లె మండల అధ్యక్షుడు, సిపిఐ నాయకులు రాధాకృష్ణ, వేణు, హరి, పవన్ కళ్యాణ్, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

## నేడే చివరి దినం మీఓటు మీహక్కు సమర్పించండి

**- మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి**



**బనగానపల్లె – సూర్య వాస్తవం:** రాష్ట్ర ప్రజలకు తెలియజేయడమేమనగా రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న సర్వేలో మీ పేరు ఓటర్ల జాబితాలో కొనసాగాలంటే నేడే గడువు దినం కావున మీ ఓటు మీ హక్కు మీ బాధ్యతను కాపాడుకోవాలని రోడ్ల భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి సోమవారం పత్రిక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా రెండు పాస్ ఫోటోలు ఆధార్ కార్డు జిరాక్స్ మీ ప్రాంతపు బిఎల్ఓ లకు అందించాలని ఆయన తెలిపారు. సమగ్రమైన ఓటర్ల జాబితా సవరణ ఎస్ ఐ ఆర్ ప్రక్రియ నేడు 14వ తేదీ గడువు ముగుస్తుండడంతో ప్రతి నియోజకవర్గంలోని అర్హత కలిగిన ఓటర్లు ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా ఓటు నమోదు చేసుకోవలసిన అవసరం ఎంతైనా ఉందని, నమోదు చేసుకోనివారు తక్షణమే ఎన్యూమరేషన్ ఫారంతో మీ పరిధిలోని సచివాలయంలో గల బిఎల్ఓతో సంప్రదించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. లేకుంటే 21వ తేదీ విడుదల అయ్యే ఓటర్ల ముసాయిదా జాబితాలో మీ ఓటు గల్లంతయ్యే అవకాశం ఉందఅనీ తెలియజేశారు.

## మునిసిపల్ కమిషనర్ ప్రసాద్ గౌడ్ బదిలీ హర్షణీయం

**- సీపీయం సూచనను గౌరవించిన ఎమ్మెల్యే కి ధన్యవాదాలు**

**- కమిషనర్ హయాంపై సమగ్ర విచారణ జరపాలి: సీపీయం పట్టణ కార్యదర్శి నక్కి శ్రీకాంత్**




**డోన్– సూర్య వాస్తవం:** డోన్ మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ గౌడ్‌ని బదిలీ చేయడాన్ని సీపీయం పార్టీ స్వాగతిస్తున్నట్లు పట్టణ కార్యదర్శి నక్కి శ్రీకాంత్ తెలిపారు. సోమవారం పట్టణంలోని సీపీయం పార్టీ కార్యాలయంలో నక్కి శ్రీకాంత్ రామాంజనేయులు నాగమద్దయ్య షేమిమ్ బేగం నక్కి హరి ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ పట్టణ ప్రజలను తీవ్రంగా ఇబ్బందులకు గురిచేసిన త్రాగునీటి సమస్య పారిశుద్ధ్య లోపాలు అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యం ప్రజల పట్ల ఏకపక్ష వైఖరిపై సీపీయం పార్టీ నిరంతరం పోరాటాలు నిర్వహిస్తూ కమిషనర్ బదిలీని డిమాండ్ చేసిన విషయం తెలిసిందేనన్నారు ప్రజల అభిప్రాయాన్ని గౌరవించి కమిషనర్ బదిలీకి చర్యలు తీసుకున్న ఎమ్మెల్యేకు ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు.అయితే బదిలీతో వ్యవహారం ముగిసినట్లుకాదని, ప్రసాద్ గౌడ్ కమిషనర్‌గా పనిచేసిన కాలంలో జరిగిన పరిపాలనా నిర్ణయాలు నిధుల వినియోగం ఉద్యోగాల కేటాయింపు లపై సమగ్ర విచారణ తప్పనిసరిగా జరగాలని డిమాండ్ చేశారు. ఎలాంటి అధికారిక నోటిఫికేషన్ లేకుండా కొత్త ఉద్యోగులను ఏ ప్రాతిపదికన ఎంపిక చేశారు, వారికి ఏ నిధుల నుంచి వేతనాలు చెల్లించారు? అనే అంశాలపై పూర్తి వివరాలను ప్రజల ముందుంచాలని కోరారు. ప్రజల నుంచి రూ.4 కోట్లకు పైగా పన్నులు వసూలు చేసినట్లు మున్సిపల్ అధికారులు ప్రకటించినప్పటికీ, ఆ నిధులతో పట్టణంలో ఎన్ని అభివృద్ధి పనులు చేపట్టారు? రహదారులు, కాలువలు, త్రాగునీటి సౌకర్యాల అభివృద్ధికి ఎంత ఖర్చు చేశారు? మున్సిపాలిటీకి ఇప్పటివరకు ఎంత నిధులు విడుదలయ్యాయి? వాటిలో ఎంత వ్యయం చేశారు? ప్రస్తుతం ఎంత నిల్వ ఉంది? అనే పూర్తి లెక్కలను బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. ప్రసాద్ గౌడ్ హయాంలో జరిగిన ఆర్థిక లావాదేవీలు, నిధుల కేటాయింపులు, ఉద్యోగ నియామకాలు, మున్సిపల్ కార్యాలయంలో తీసుకున్న కీలక నిర్ణయాలపై నిష్పాక్షికంగా సమగ్ర విచారణ నిర్వహించి, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేను కోరారు. కొత్తగా బాధ్యతలు స్వీకరించే కమిషనర్ ప్రజా సమస్యల పరిష్కారానికే తొలి ప్రాధాన్యత ఇవ్వాలని, త్రాగునీటి సరఫరా, పారిశుద్ధ్యం, రహదారులు, డ్రైనేజీ వంటి సమస్యలను శాశ్వతంగా పరిష్కరించే దిశగా పారదర్శక పరిపాలన అందించాలని సీపీయం పార్టీ డిమాండ్ చేసింది.

## డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సంపూర్ణ ఆయురారోగ్యాలతో కోలుకోవాలి

**- జనసేన పార్టీ**



**గుత్తి – సూర్య వాస్తవం:** గుత్తి పట్టణంలో జనసేన పార్టీ శ్రేణు లు ప్రత్యేక పూజలు చేయించారు. ముంబాయిలోని కుడి భుజానికి శస్త్ర చికిత్స చేయించుకున్న ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ ఆ పరమశివుడు దివ్య ఆశీస్సులతో రానున్న రోజుల్లో మరింత ఉత్సా హంగా ప్రజాసేవ కొనసాగించాలని కోరుకున్న గుత్తి జనసేన పార్టీ మం డల అధ్యక్షుడు పోతురాజుల చిన్న వెంకటేశు,పట్టణ అధ్యక్షుడు పాటిల్ సురేష్, పట్టణ ప్రధాన కార్యదర్శి బోయగడ్డ బ్రహ్మయ్య, పట్టణ ఉప కార్యదర్శి గోరంట్ల నాగయ్య,మండ ల ప్రధాన కార్యదర్శి మిద్దె ఓబులేష్, బసినేపల్లి ఫీల్డ్ అసిస్టెంట్ రంగా,ధ నంజయ,రాయల్ వెల్ఫేర్ అసోసి యేషన్ అధ్యక్షుడు మారాకుల రమణ, చిరంజీవి ఫ్యాన్స్ సీనియర్ అభి మాని అశ్వనాగప్ప, రామాంజనేయులు మందుల షాపు సురేష్, మనోజ్, రమేష్, భాష తదితరులు పాల్గొన్నారు.

PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS ADDRESS : # DOOR NO-4-29-A-19-12-, DONTHI STREET, MADANAPALLI, ANNAMAYYA, CHITTOOR, ANDHRA PRADESH - 517325. CELL : 9885404140 ( ASSOCIATE EDITOR -Mohammad Shafi Ahamad 9948461699 )

# అండర్‌పాస్ తెరవాలి... రైతుల కన్నీరు తుడవాలి

- అక్కగారిపేట ప్రజల ఆవేదనకు జెడ్పీటీసీ గళం
- హైవే అభివృద్ధి పేరుతో గ్రామానికి ఇబ్బందులే..!
- అండర్‌పాస్ ఉన్నా... అడుగేయలేని దుస్థితి
- అండర్‌పాస్‌ను వెంటనే అందుబాటులోకి తేవాలి.. రైతుల సాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలి
- జాతీయ రహదారుల ప్రాధికార సంస్థకు నన్నం ప్రిస్కిల్ల వినతి
- అసంపూర్తి అండర్‌పాస్‌తో ప్రాణాలకు ముప్పు.. హైవేపైనే ప్రజల రాకపోకలు
- 200 ఎకరాల సాగుభూములు నీరందక బీడుగా మారుతున్నాయన్న ఆందోళన
- సర్వీస్ రోడ్డు, పంటకాలువల నిర్మాణంతో గ్రామానికి శాశ్వత ఉపశమనం కల్పించాలని విజ్ఞప్తి



**పెళ్లకూరు – సూర్య వాస్తవం:** తిరుపతి జిల్లా పెళ్లకూరు మండలంలోని అక్కగారిపేట గ్రామ ప్రజలు ఎన్నాళ్లుగానో ఎదురుచూస్తున్న జాతీయ రహదారి--71పై నిర్మించిన యూపీవీసీ (అండర్‌పాస్) ఇప్పటికీ ప్రజలకు ఉపయోగపడకపోవడం, మరోవైపు జాతీయ రహదారి నిర్మాణం కారణంగా వ్యవసాయ భూములకు సాగునీరు అందక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో ఈ రెండు సమస్యలపై అధికార యంత్రాంగం తక్షణం స్పందించాలని పెళ్లకూరు మండల జెడ్పీటీసీ సభ్యురాలు నన్నం ప్రిస్కిల్ల డిమాండ్ చేశారు. ఈ మేరకు భారత జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ) ప్రాజెక్టు డైరెక్టర్‌కు ఆమె వినతిపత్రాలు సమర్పించారు. వినతిపత్రంలో గ్రామ ప్రజలు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను సవివరంగా ప్రస్తావిస్తూ, ప్రజల ప్రాణ భద్రత, రైతుల జీవనాధారం దృష్ట్యా అత్యవసర చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు.

జాతీయ రహదారి--71 నిర్మాణంలో భాగంగా అక్కగారిపేట గ్రామం వద్ద యూపీవీసీ (అండర్‌పాస్) నిర్మాణం పూర్తయినప్పటికీ, ఇప్పటివరకు దానిని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసి ప్రజల వినియోగానికి అందుబాటులోకి తీసుకురాలేదని ఆమె పేర్కొన్నారు. దీంతో గ్రామ ప్రజలు, విద్యార్థులు, వృద్ధులు, మహిళలు, రైతులు, పశువులు సైతం నిత్యం జాతీయ రహదారిపైనే ప్రాణాలను పణంగా పెట్టి రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి నెలకొన్నదని ఆవేదన వ్యక్తం చేశారు. అధిక వేగంతో దూసుకెళ్తున్న వాహనాల మధ్య ప్రజలు హైవే దాటాల్సి రావడం వల్ల ప్రమాదాలు తరచూ చోటుచేసుకుంటున్నాయని, ఏ క్షణంలోనైనా పెద్ద ప్రమాదం జరిగే అవకాశం ఉందని ఆమె అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. కోట్లాది రూపాయలతో నిర్మించిన అండర్‌పాస్ ప్రజలకు ఉపయోగపడకుండా నిరుపయోగంగా ఉండటం విచారకరమని పేర్కొన్నారు. అండర్‌పాస్‌లో సరైన నీటి పారుదల వ్యవస్థ లేకపోవడంతో వర్షపు నీరు రోజుల తరబడి నిల్వ ఉంటోందని, దీనివల్ల దోమల వ్యాప్తి అధికమై గ్రామ ప్రజలు డెంగ్యూ, మలేరియా వంటి అంటువ్యాధుల బారిన పడే ప్రమాదం పెరుగుతోందని తెలిపారు. ప్రజల ఆరోగ్య భద్రతను దృష్టిలో ఉంచుకొని నీరు నిల్వ కాకుండా శాశ్వత డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేసి, అండర్‌పాస్‌ను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసి వెంటనే ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. అదేవిధంగా జాతీయ రహదారి నిర్మాణం సందర్భంగా అక్కగారిపేట పరిసర ప్రాంతాల్లో ఉన్న పంటకాలువలు దెబ్బతినడంతో నెలబల్లి చెరువు నుంచి వ్యవసాయ భూములకు చేరాల్సిన సాగునీరు పూర్తిగా నిలిచిపోయిందని ఆమె వివరించారు. ఈ కారణంగా సుమారు 200 ఎకరాల సస్యశ్యామలమైన సాగుభూములు నీటి కొరతతో సాగుకు అనుకూలంగా లేక బీడుభూములుగా మారిపోతున్నాయని, రైతులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. వ్యవసాయమే ప్రధాన జీవనాధారంగా ఉన్న ఈ ప్రాంతంలో కాలువల సమస్యను వెంటనే పరిష్కరించి, చెరువు నీరు మళ్లీ పంట పొలాలకు చేరేలా చర్యలు తీసుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు. రైతుల భవిష్యత్తు, ఆహార భద్రతను దృష్టిలో ఉంచుకొని దీనిపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. ఇప్పటికే అండర్‌పాస్ నిర్మాణం పూర్తయిన నేపథ్యంలో గ్రామ ప్రజల సౌకర్యార్థం అండర్‌పాస్‌కు అనుసంధానంగా ఇరువైపులా సర్వీస్ రోడ్లు నిర్మించాలని కూడా ఆమె అధికారులను కోరారు. సర్వీస్ రోడ్డు లేకపోవడంతో గ్రామస్థులు నిత్యావసర పనుల కోసం కూడా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్‌లు, వ్యవసాయ వాహనాలు సైతం సకాలంలో రాకపోకలు సాగించలేని పరిస్థితి ఏర్పడిందని వివరించారు. ప్రజల భద్రత, రైతుల సంక్షేమం, గ్రామ అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని అక్కగారిపేటలో నెలకొన్న ఈ మూడు ప్రధాన సమస్యలను అత్యవసరంగా పరిశీలించి తక్షణ చర్యలు తీసుకోవాలని నన్నం ప్రిస్కిల్ల జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ అధికారులను కోరారు. అధికారుల సానుకూల స్పందనతో గ్రామ ప్రజలకు న్యాయం జరుగుతుందనే ఆశాభావాన్ని ఆమె వ్యక్తం చేశారు. గ్రామాభివృద్ధి, ప్రజల భద్రత, రైతుల సంక్షేమం కోసం అవసరమైతే సంబంధిత శాఖలతో సమన్వయం చేసి సమస్యలు పరిష్కరించే వరకు తన పోరాటం కొనసాగుతుందని జెడ్పీటీసీ సభ్యురాలు నన్నం ప్రిస్కిల్ల స్పష్టం చేశారు. గ్రామ ప్రజల తరఫున సమర్పించిన ఈ వినతిపత్రాలపై జిల్లా యంత్రాంగం, జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని అక్కగారిపేట గ్రామస్థులు, రైతులు కోరుతున్నారు.

## ఇన్‌చార్జి ఎంపీడీఓ మురళి ఆకస్మిక మృతి

**- కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపిన ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ**






**పెళ్లకూరు– సూర్య వాస్తవం:** సూళ్లూరుపేట మండల ఇంచార్జి ఎంపీడీఓ మురళి ఆకస్మిక మరణం స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది. సెలవులో ఉన్న సమయంలో ఆయన మృతి చెందారనే వార్త తెలిసి ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు, ప్రజలు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. విధి నిర్వహణలో నిబద్ధత, ప్రజలకు అందుబాటులో ఉండే స్వభావంతో గుర్తింపు పొందిన మురళి మృతి ప్రభుత్వ యంత్రాంగానికి తీరని లోటుగా పలువురు అభిప్రాయపడ్డారు. ఈ విషాద వార్త తెలుసుకున్న వెంటనే సూళ్లూరుపేట నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ తన భర్త పార్థుతో కలిసి మురళి భౌతికకాయానికి నివాళులర్పించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, మురళి ఆకస్మిక మృతి అత్యంత బాధాకరమని అన్నారు. ప్రజాసేవలో నిబద్ధతతో పనిచేసిన ఒక సమర్థ అధికారి అకాల మరణం ప్రతి ఒక్కరినీ కలచివేసిందని పేర్కొన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు ఈ లోటును భరించే మనోధైర్యాన్ని, శక్తిని భగవంతుడు ప్రసాదించాలని ఆకాంక్షించారు. పరమపదించిన మురళి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. మురళి మృతికి ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు, వివిధ వర్గాల ప్రజలు సంతాపం వ్యక్తం చేస్తూ, ఆయన సేవలను స్మరించుకున్నారు.

## మంత్రి సత్య కుమార్ యాదవ్ సమర్థ నాయకత్వంతో మరో మైలురాయి...

**- ఢిల్లీకి ఒక ఫోన్ చేసి రాష్ట్రానికి మెడికల్ సీట్స్ తెప్పించిన మంత్రి సత్య కుమార్ యాదవ్**




**దొరవారిసత్రం –సూర్య వాస్తవం:** ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వ వైద్య విద్య విస్తరణకు మరో కీలక ముందడుగు పడింది. జాతీయ వైద్య మండలి (ఎన్ఎంసి)రాష్ట్రానికి మరో 175 ఎంబీబీఎస్ సీట్లకు అనుమతి ఇవ్వడంతో, ఈ విద్యా సంవత్సరంలోనే కొత్తగా లభించిన సీట్ల సంఖ్య 275కు చేరింది. వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఢిల్లీలో కేంద్ర ఆరోగ్య శాఖ, ఎన్ఎంసి ఉన్నతాధికారులతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ, లోపాలను సరిదిద్ది ఈ అద్భుత ఫలితాన్ని సాధించారు.

**"సీట్ల పెంపు వివరాలు":** పిడుగురాళ్ల ప్రభుత్వ వైద్య కళాశాల:100 ఎంబీబీఎస్ సీట్లతో తొలి అనుమతి లభించింది. విజయవాడ ప్రభుత్వ సిద్ధార్థ వైద్య కళాశాల,అదనంగా 75 సీట్లు మంజూరయ్యాయి. కడప ప్రభుత్వ వైద్య కళాశాల,75 సీట్ల పెంపునకు ఆమోదం లభించింది. నెల్లూరు ఏసిఎస్ఆర్ ప్రభుత్వ వైద్య కళాశాల,25 సీట్లు పెరిగాయి. గత మూడేళ్లలో పెరిగిన మొత్తం సీట్ల సంఖ్య 455కు చేరింది.

**"విద్యార్థులకు చేకూరే లాభం":** నీట్ మెరిట్ విద్యార్థులకు ప్రభుత్వ కళాశాలల్లో ప్రవేశ అవకాశాలు పెరిగాయి. ఖరీదైన ప్రైవేట్ వైద్య కళాశాలలను ఆశ్రయించాల్సిన అవసరం తగ్గడం వల్ల వేలాది కుటుంబాలపై ఆర్థిక భారం తప్పుతుంది. దీర్ఘకాలంలో రాష్ట్రానికి ఎక్కువ మంది వైద్యులు అందు బాటులోకి వచ్చి ప్రభుత్వ వైద్య సేవల నాణ్యత మరింత పెరుగుతుంది.

## పార్టీ బలోపేతమే లక్ష్యంగా వైసీపీ సమన్వయ సమావేశం

**- రాష్ట్ర నాయకత్వం దిశానిర్దేశంలో సంస్థాగత నిర్మాణంపై విస్తృత చర్చ**

**- సజ్జల రామకృష్ణారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసిన కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి- గ్రామస్థాయి నుంచి నియోజకవర్గ స్థాయి వరకు పార్టీని మరింత బలోపేతం చేయాలని పిలుపు**

**పెళ్లకూరు–సూర్య వాస్తవం:** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడం, సంస్థాగత వ్యవస్థను పటిష్టం చేయడం, రానున్న రాజకీయ కార్యక్రమాలకు కార్యాచరణ రూపొందించడం లక్ష్యంగా నెల్లూరులో నిర్వహించిన కీలక సమన్వయ సమావేశం పార్టీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపింది. రాష్ట్ర నాయకత్వం ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో జిల్లాల వారీగా పార్టీ పరిస్థితులు, నియోజకవర్గాల వారీగా చేపట్టాల్సిన కార్యక్రమాలు, ప్రజలతో మరింత సన్నిహితంగా ఉండేందుకు అను సరించాల్సిన వ్యూహాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సమావేశానికి వైఎస్సార్‌సీపీ రాష్ట్ర నాయకులు సజ్జల రామకృష్ణారెడ్డి, నెల్లూరు జిల్లా పార్టీ అధ్యక్షుడు కాకాని గోవర్ధన్ రెడ్డి, తిరుపతి జిల్లా పార్టీ అధ్యక్షుడు భూమా కరుణాకర్ రెడ్డి, సూళ్లూరుపేట మాజీ శాసనసభ్యుడు కిలివేటి సంజీవయ్య, వివిధ జిల్లాల పర్యవేక్షకులు, నియోజకవర్గ ఇన్‌చార్జిలు, సమన్వయకర్తలు, పార్టీ ముఖ్య నాయకులు హాజరై సంస్థాగత అంశాలపై సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో తిరుపతి జిల్లా పెళ్లకూరు మండలానికి చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి కూడా పాల్గొన్నారు. సమావేశం అనంతరం ఆయన పార్టీ సీనియర్ నాయకుడు సజ్జల రామకృష్ణారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ బలోపేతానికి చేపట్టాల్సిన కార్యక్రమాలు, గ్రామస్థాయి కమిటీల పనితీరు, కార్యకర్తల సమన్వయం, ప్రజా సమస్యలపై పార్టీ స్పందన, రానున్న రాజకీయ కార్యక్రమాల నిర్వహణ తదితర అంశాలపై సజ్జల రామకృష్ణారెడ్డితో కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి సంక్షిప్తంగా చర్చించినట్లు తెలిసింది. సమావేశంలో రాష్ట్ర నాయకత్వం పార్టీ శ్రేణులకు పలు కీలక సూచనలు చేసినట్లు సమాచారం. ప్రతి గ్రామంలో పార్టీ కార్యకలాపాలను మరింత చురుకుగా నిర్వహించడం, ప్రజలతో నిరంతర సంబంధాలు కొనసాగించడం, ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు వైఎస్సార్‌సీపీ సిద్ధాంతాలను విస్తృతంగా ప్రచారం చేయాలని నాయకత్వం పిలుపునిచ్చినట్లు పేర్కొన్నారు. ఈ సమావేశం పార్టీ నాయకులు, కార్యకర్తల్లో నూతనోత్సాహాన్ని నింపిందని, రానున్న రోజుల్లో నియోజకవర్గాల వారీగా పార్టీని మరింత బలోపేతం చేసేందుకు సమన్వయంతో ముందుకు సాగాలని రాష్ట్ర నాయకత్వం స్పష్టం చేసినట్లు సమావేశంలో పాల్గొన్న నాయకులు తెలిపారు. కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ పార్టీ అధిష్ఠానం సూచించిన దిశానిర్దేశాల మేరకు క్షేత్రస్థాయిలో కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ పార్టీ అభివృద్ధికి కృషి చేస్తామని పేర్కొన్నారు.





## ఎస్ఐఆర్ పనితీరుపై తాసిల్దార్ రాజేంద్ర సమీక్ష




**దొరవారిసత్రం–సూర్య వాస్తవం :** ఎస్ఐఆర్ ప్రక్రియ పనితీరు ఓటర్ల ఎన్యుమరేషన్ పనితీరుపై దొరవారిసత్రం తాసిల్దార్ రాజేంద్ర సోమవారం మండల పరిధిలోని పోలింగ్ స్టేషన్ నంబర్ 190 మావిళ్ళ పాడు గ్రామంలో బిఎల్ ఓ,బి ఎల్ ఏ లతో సమావేశం ఏర్పాటు చేసి జరిగిన కార్యక్రమం పై తాసిల్దార్ రాజేంద్ర రివ్యూ నిర్వహించారు. 14 తేదీతో ఈ ప్రక్రియ ముగియనుండడంతో సాధించిన ఫలితాలను గురించి,పనితీరును పరిశీలించారు. గ్రామపంచాయతీ స్థాయిలో చనిపోయిన వారిని, దీర్ఘకాలికంగా గ్రామం విడిచి వెళ్లిన వారిని ఎందరు ఓటర్ల జాబితా నుండి తొలగించబడ్డారని పరిశీలించారు. నిబద్ధతతో, ఈ ప్రక్రియ పూర్తి చేసినందుకు సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ రాజేంద్ర, ఏపీఓ ఉషా, సీనియర్ అసిస్టెంట్ వాసు, వీఆర్ఏ పాల్గొన్నారు.

## ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిస్తున్న శ్రీ లక్ష్మి చెన్నకేశవ స్వామి

**- దేవాలయ పునఃనిర్మాణంకు దాతలు చేయూతనివ్వండి**



**పామిడి– సూర్య వాస్తవం:** పామిడి పట్టణంలో శ్రీ లక్ష్మి చెన్నకేశవస్వామి దేవాలయంలో ఆరుద్ర నక్షత్రాన్ని పురస్క రించుకొని సోమవారం స్వామి వారికి విశేష పూజలు జరిగాయి. భక్తులు పెద్ద ఎత్తున వచ్చి మొక్కలు తీర్చుకున్నారు. ప్రస్తుతం దేవాలయం 500 సంవ త్సరాల క్రితం వెలసి మహాప్రసిద్ధి చెందిన అతి పురాతన దేవాలయం. ప్రస్తుతం ఆ దేవాలయం శిథిలావస్థకు చేరు కుంది. అందుకని ఆలయ పునఃనిర్మాణంను నిర్మించదలచా మని ఆలయ కమిటీ, అర్చకులు పురుషోత్తం భక్తులుకు తెలిపారు. ఇందులకు దేవాదాయశాఖ వారు సి జి యఫ్ నిధుల కింద 1కోటి 60 లక్షలు మంజూరు చేశారని, దీనికి మ్యాచింగ్ గ్రాంట్ 40 లక్షలు భక్తుల ద్వారా విరాళాలు సేకరించవలసి ఉన్నదని వారు తెలిపారు. కావున దేవాలయ పునః నిర్మాణానికి విరాళాలు ఇచ్చి స్వామివారి కృపకు పాత్రులు అవుతుందని మనవి చేసుకున్నారు. పవిత్రమైన దైవ కార్యమును సద్వినియోగం చేసుకోవాలని భక్తాదులను కోరారు.